# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 1 సంచిక : 325 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం బుధవారం 30 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 325 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM WED 30 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur




## చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

- 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం ప్రారంభం
- రూ.1.30 లక్షల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్న పవన్
- గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల వేగంతో అభివృద్ధి చేస్తున్నామని వెల్లడి
- రూ.11,085 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, పండ్ల తోటల నిర్మాణం
- అభివృద్ధి పనుల నాణ్యతను ప్రజలే పర్యవేక్షించాలని పిలుపు

- మిగతా 2లో



## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

- ఇటీవల కన్నుమూసిన వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్
- ఒంగోలులో కాకుమాను నివాసానికి వెళ్లిన జగన్
- కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా

- మిగతా 2లో

## నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

- విజయవాడలో మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల సదస్సు
- ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఏపీకి దేశంలోనే ప్రథమ స్థానం
- పాలనలో టెక్నాలజీ వాడకం పెరగాలని సీఎం చంద్రబాబు పిలుపు
- నేర్చుకున్న నైపుణ్యాలు సేవల నాణ్యతలో కనిపించాలని స్పష్టీకరణ

- మిగతా 2లో






# పల్లె పండుగ 3.0 ప్రారంభం..
# గ్రామాలకు రూ.11,085 కోట్లు

- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన
- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి
- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

### గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది,"

- మిగతా 2లో

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

అమెరికాకు జైశంకర్ గట్టి సంకేతం



- ఉగ్రవాదంపై భాగస్వాముల వైఖరి సంబంధాలను ప్రభావితం చేస్తుందన్న జైశంకర్
- తమ ప్రధాన ఆందోళనను అర్థం చేసుకోకపోతే ఇబ్బందులు తప్పవని స్పష్టీకరణ
- దశాబ్దాలుగా పొరుగు దేశం నుంచి ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటున్నామని వెల్లడి
- భారత్-అమెరికా బంధానికి వాణిజ్య విభేదాలతో పాటు ఉగ్రవాదం కూడా సవాల్ అని వ్యాఖ్య

- మిగతా 2లో



## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

పెన్ పవర్ డెస్క్: ప్రతిపక్ష ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై చెప్పింది. ఇకపై ఇండియా కూటమిలో తాము భాగం కాదని తెలిపింది. కాంగ్రెస్?తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 30న కాంగ్రెస్ అధ్యక్షతన జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

- మిగతా 2లో

ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు..

## లోకేశ్‌కు షణ్ముగం కితాబు



- ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో సింగపూర్ హోం మంత్రి షణ్ముగం భేటీ
- రాష్ట్రంలో విద్యా సంస్కరణలను ప్రశంసించిన సింగపూర్ మంత్రి
- మాదకద్రవ్యాల నియంత్రణ, విద్యారంగంలో ఏపీకి సహకారం అందిస్తామని హామీ
- ఏపీ ఐటీఐలను సింగపూర్ ఐటీఈతో అనుసంధానించాలని నిర్ణయం
- డ్రాపౌట్లను సున్నా శాతానికి తగ్గించాలని షణ్ముగం సూచన

- మిగతా 2లో

## నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్




- జమ్మూకశ్మీర్‌లోని కతువా జిల్లాలో సీఐఎస్ఎఫ్ క్యాంపులో దారుణం
- సహోద్యోగులపై కాల్పులు జరిపిన హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్
- అసిస్టెంట్ కమాండెంట్ సహా నలుగురు సిబ్బంది అక్కడికక్కడే మృతి
- వాగ్వాదమే కాల్పులకు కారణమని ప్రాథమిక సమాచారం
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు.. సీఐఎస్ఎఫ్ ఉన్నతస్థాయి విచారణ

- మిగతా 2లో

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను

- మిగతా 2లో

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

- ఎన్నికల ప్రక్రియలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని కాంగ్రెస్ ఆరోపణ
- ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామాకు డిమాండ్
- 13.30 కోట్ల ఓట్లను తొలగించారని, వాటిని పునరుద్ధరించాలని తీర్మానం
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలని పట్టు
- పార్లమెంటు, కోర్టులు, వీధుల్లో పోరాడతామని కాంగ్రెస్ ప్రకటన

- మిగతా 2లో



## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి



పెన్ పవర్ డెస్క్:మాస్కో: రష్యాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. శిక్షణ సమయంలో రష్యా సైనిక విమానం (Tu-95 బాంబర్) కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా మరొకరు గాయపడ్డారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. తూర్పు అమూర్

- మిగతా 2లో



## అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

- చివరి వ్యక్తి సంక్షేమమే అభివృద్ధికి గీటురాయి అన్న భగవత్
- అభివృద్ధిలో అంతరాలు వీలైనంత తగ్గించాలని సూచన
- ప్రకృతిని కాపాడుకుంటూనే ప్రగతి సాధించాలి
- అభివృద్ధి బాధ్యత సమాజం కూడా తీసుకోవాలని పిలుపు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

దేశాభివృద్ధిలో రాబోయే రెండు దశాబ్దాలు అత్యంత కీలకమని, ప్రజల మారుతున్న ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలనా వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. నైపుణ్యాభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారానే ఇది సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన "మిషన్ కర్మయోగి" దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించి ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు ప్రకటించిన పురస్కారాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి స్వీకరించారు. ఈ విభాగంలో కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచి అవార్డులను అందుకున్నాయి. శిక్షణ అంటే కేవలం ధ్రువపత్రాలు పొందడం మాత్రమే కాదని, నేర్చుకున్న నైపుణ్యాలు ప్రజలకు అందే సేవల నాణ్యతలో ప్రతిబింబించాలని సీఎం పేర్కొన్నారు. "ఒక రెవెన్యూ అధికారి సమస్యను వేగంగా పరిష్కరించడం, ఉపాధ్యాయుడు మెరుగ్గా బోధించడం వంటి సానుకూల మార్పులే శిక్షణకు అసలైన గీటురాయి" అని ఆయన వివరించారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఇంకా పాత నిబంధనలు, అనవసరమైన పేపర్‌వర్క్‌ను కొనసాగించడం సరికాదని, పాలనా ప్రక్రియలను సమూలంగా సంస్కరించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు సోషల్ మీడియాలో సమయాన్ని వెచ్చించే బదులు, 'ఐగాట్-మిషన్ కర్మయోగి' వేదిక ద్వారా తమ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కేవలం నియంత్రణ వ్యవస్థగా కాకుండా, ప్రజలను సాధికారత దిశగా నడిపించేదిగా ఉండాలని, తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పలు దక్షిణాది రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

- మొదటి పేజి తరువాయి

డీఎంకే ప్రతినిధి టి.కె.ఎస్. ఇలంగోవన్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష ఇండియా కూటమిలో ఇకపై డీఎంకే భాగం కాదని తెలిపారు. కాంగ్రెస్ తో విభేదాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ 30న జరగనున్న ఇండియా కూటమి సమావేశానికి కూడా డీఎంకే హాజరు కాదని ఆయన తేల్చిచెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ తమతో బంధాన్ని తెంచుకుని అధికార టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చి మాకు ద్రోహం చేసిందని విమర్శించారు. కేవలం రెండు పదవుల కోసం ఆశపడి కాంగ్రెస్ డీఎంకేకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. కాంగ్రెస్ తీరుతో ఇండియా కూటమిలోని ఇతర పార్టీలు కూడా అసంతృప్తితో ఉన్నాయని.. సమావేశానికి వెళ్లేందుకు ఆ పార్టీలు కూడా విముఖత వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. అయితే, బీజేపీపై వ్యతిరేకత విషయంలో ఇండియా కూటమిలోని పార్టీలు భావజాలపరంగా ఐక్యంగానే ఉన్నాయని చెప్పారు. ఇండియా కూటమి సమావేశానికి హాజరుకానంత మాత్రాన ఎన్డీఏకు మద్దతు ఇస్తున్నట్లు కాదని పేర్కొన్నారు.

### ఇండియా కూటమి కీలక సమావేశం

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) విషయంలో ఈసీలో భేదాభిప్రాయాలు ఉన్నాయన్న వార్తలు దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలనే డిమాండ్‌తో పాటు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియపై చర్చించేందుకు సెప్టెంబర్ 30న ఇండియా కూటమి సమావేశానికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. కాంగ్రెస్‌తో విభేదాల నేపథ్యంలో డీఎంకే ఇండియా కూటమి నుంచి వైదొలగడంతో పాటు సమావేశానికి కూడా హాజరు కావడం లేదని తెలిపింది. ఇక, ముందస్తు షెడ్యూల్ కారణంగా యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా ఇండియా కూటమి సమావేశానికి హాజరు కావడం లేదు. సమాజ్ వాదీ పార్టీ తరుఫున సీనియర్ నేత ఈ సమావేశానికి హాజరు కానున్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- మొదటి పేజి తరువాయి

గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాలను ప్రభుత్వం గౌరవిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం.. ఆరుగురు మృతి

- మొదటి పేజి తరువాయి

ప్రాంతంలోని క్రాస్నోయరోవో గ్రామానికి సమీపంలో మంగళవారం (సెప్టెంబర్ 29) ఈ ప్రమాదం జరిగింది. సాంకేతిక కారణాలతో టేకాఫ్ అయిన కాసేపటికే విమానం కుప్పకూలింది. ప్రమాద సమయంలో విమానంలో మొత్తం ఏడుగురు ఉన్నారు. ఇందులో ఆరుగురు మరణించగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. జనవాసాలు లేని ప్రదేశంలో విమానం కుప్పకూలడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణం ఏంటన్నది ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేప్టటారు. ఫ్లైట్ క్రాష్?కు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్?గా మారాయి. ఈ వీడియోలో.. కుప్పకూలగానే విమానం ఇంధనం ట్యాంకులు పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగడం కనిపించింది.

# పల్లె పండుగ 3.0 ప్రారంభం.. గ్రామాలకు రూ.11,085 కోట్లు

- మొదటి పేజి తరువాయి

అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

### పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

### ఉదయగిరికి వరాల జల్లు

ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.

65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు.

90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 భూసేకరణకు రూ.85 కోట్లు.

రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు.

కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు.

వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

### సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఏపీ విద్యా సంస్కరణలకు సింగపూర్ ప్రశంసలు.. లోకేశ్‌కు షణ్ముగం కితాబు

ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వినూత్న సంస్కరణలను సింగపూర్ ప్రభుత్వం ప్రశంసించింది. రాష్ట్ర విద్యావ్యవస్థ బలోపేతానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని సింగపూర్ హోం, న్యాయశాఖల మంత్రి కె. షణ్ముగం హామీ ఇచ్చారు. మంగళవారం తిరుమలలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఆయన భేటీ అయ్యారు. శ్రీవారి దర్శనం అనంతరం ఇరువురు నేతలు రాష్ట్ర అభివృద్ధి, విద్యా సంస్కరణలు, మాదకద్రవ్యాల నివారణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను, ముఖ్యంగా విద్యారంగంలో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను మంత్రి లోకేశ్ వివరించారు. ప్రభుత్వ పనితీరుతో పాటు విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను మంత్రి షణ్ముగం ఈ సందర్భంగా అభినందించారు.

పాఠశాలల్లో డ్రాపౌట్ రేటును సున్నా శాతానికి తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి షణ్ముగం సూచించారు. బడి మానేసే పిల్లలే భవిష్యత్తులో మాదకద్రవ్యాల బారిన పడే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు సింగపూర్ తరహా కఠిన చట్టాలు అవసరమని అభిప్రాయపడుతూ, డ్రగ్స్ రహిత ఏపీ నిర్మాణానికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్న తీరును మంత్రి లోకేశ్ వివరించగా, ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలను స్వయంగా సందర్శించేందుకు మంత్రి షణ్ముగం ఆసక్తి వ్యక్తం చేశారు. అలాగే, యువతకు ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ అందించే లక్ష్యంతో ఏపీలోని ఐటీఐలను సింగపూర్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్' (ఐటీఈ)తో అనుసంధానించేందుకు పరస్పరం సహకరించుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించారు.

# చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

### గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

### రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0'

'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

### ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా స్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

### అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం

అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు. రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## నలుగురు సహోద్యోగులను కాల్చి చంపిన సీఐఎస్ఎఫ్ జవాన్

జమ్మూకశ్మీర్‌లో తీవ్ర విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)కు చెందిన ఒక జవాన్ తన సహోద్యోగులపై విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక ఉన్నతాధికారి కూడా ఉన్నారు. కతువా జిల్లాలోని సేవా-2 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కతువా జిల్లాలోని బసోహ్లి ప్రాంతంలో ఉన్న సేవా-2 హైడల్ పవర్ ప్రాజెక్టుకు సీఐఎస్ఎఫ్ సిబ్బంది భద్రత కల్పిస్తున్నారు. మంగళవారం సాయంత్రం 7 గంటల సమయంలో డ్యూటీ మార్పు జరుగుతుండగా, హెడ్ కానిస్టేబుల్ అవధేశ్ సింగ్ అనే జవాన్‌కు, ఇతర సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో ఆగ్రహంతో ఊగిపోయిన అవధేశ్ సింగ్, తన వద్ద ఉన్న తుపాకీతో సహోద్యోగులపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో అసిస్టెంట్ కమాండెంట్ అంకిత్ కుమార్ పాండే, సబ్-ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ సింగ్, కానిస్టేబుళ్లు రఫిక్ అహ్మద్, సందీప్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సంఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన ఇతర సిబ్బంది, నిందితుడు అవధేశ్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని, కతువా పోలీసులకు అప్పగించారు. కతువా ఎస్ఎస్‌పి మోహితా శర్మ ఈ ఘటనను ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు, సీఐఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు ఉన్నతస్థాయి విచారణకు (కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ) ఆదేశించింది. సీఐఎస్ఎఫ్ డీజీ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేవలం చిన్న వాగ్వాదమే ఈ దారుణానికి కారణమా లేక మరేదైనా నేపథ్యం ఉందా అనే కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. ఒకే దళానికి చెందిన సిబ్బంది మధ్య జరిగిన ఈ కాల్పుల ఘటన (ఫ్రాట్రిసైడ్) తీవ్ర కలకలం రేపింది.

## వైసీపీ నేత కాకుమాను కుటుంబానికి జగన్ పరామర్శ

వైసీపీ అధినేత జగన్ ఈరోజు ఒంగోలులో పర్యటించారు. ఇటీవల మరణించిన పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఒంగోలులోని రాజశేఖర్ నివాసానికి వెళ్లిన జగన్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

కాగా, విజయవాడలో సెప్టెంబర్ 21న డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ చేపట్టిన నిరసనలో జరిగిన తోపులాట అనంతరం రాజశేఖర్ అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. రాజశేఖర్ గతంలో లిడ్?క్యాప్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

## అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి

అభివృద్ధి ఫలాలు సమాజంలోని అట్టడుగున ఉన్న చివరి వ్యక్తికి అందాలని, వారి ముఖంలో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధి అంటే అందరినీ ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాన్ని వీలైనంతగా తగ్గించడమేనని ఆయన స్పష్టం చేశారు. 'కొంతమందికే గరిష్ఠ ప్రయోజనం' చేకూరాలన్న వాదనను తాను వ్యతిరేకిస్తున్నానని, దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశించినట్లుగా 'అందరికీ మేలు' జరగాలని భగవత్ ఆకాంక్షించారు. ఏ నిర్ణయం తీసుకున్నా సమాజంలోని అత్యంత నిరుపేద వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రతి వ్యక్తికి కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలతో పాటు నాణ్యమైన విద్య, వైద్యం అందించి, వారు గౌరవప్రదంగా జీవించేలా చూడటమే నిజమైన అభివృద్ధి అని ఆయన వివరించారు. రైతులు రుణాల ఊబిలో కూరుకుపోకుండా సేంద్రియ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, విత్తనాలు, ఎరువుల విషయంలో స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. ప్రగతి పేరిట ప్రకృతిని విధ్వంసం చేయకూడదని హితవు పలికారు. అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదని, సమాజం కూడా తన వంతు పాత్ర పోషించాలని మోహన్ భగవత్ పిలుపునిచ్చారు.

## ఎన్నికల 'మ్యాచ్ ఫిక్సింగ్'.. ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు.

దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరపున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ఉగ్రవాదంపై రెడ్ లైన్ గీశాం

భారత్-అమెరికా సంబంధాల నేపథ్యంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదంపై భారత్ ఆందోళనలను భాగస్వామ్య దేశాలు గుర్తించకపోతే, అది ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ ఒక 'రెడ్ లైన్' గీసుకుందని, ఈ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ ఉన్నత స్థాయి సమావేశాల అనంతరం న్యూయార్క్‌లో 'ఏషియా సొసైటీ' నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ ప్రసంగించారు. దశాబ్దాలుగా ఒక పొరుగు దేశం ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా మార్చుకుని భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోందని, పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే ఆయన దుయ్యబట్టారు. "అత్యంత కీలకమైన ఉగ్రవాద సమస్యపై మా భాగస్వామ్య దేశాల నుంచి సరైన అవగాహన, సానుభూతి లభించకపోతే, అది కచ్చితంగా ఇబ్బందులకు దారితీస్తుంది. మా ప్రాథమిక ఆందోళనలను విస్మరిస్తే, సంబంధాలపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. భారత్-అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే అంశాల్లో వాణిజ్య, టారిఫ్ వివాదాలతో పాటు ఉగ్రవాదం కూడా ప్రధానమైనదని జైశంకర్ వివరించారు. ప్రస్తుత అమెరికా ప్రభుత్వం పాకిస్థాన్ పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తున్న తరుణంలో జైశంకర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

భారత్-అమెరికా బంధం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుందని ఆశిస్తున్నప్పటికీ, పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో వాస్తవిక దృక్పథంతో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పొరుగు దేశం నుంచే మద్దతు అందుతోందని నిరూపించేందుకు భారత్ పదేపదే తగిన ఆధారాలను సమర్పించిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# టేకులబోరులో అంగన్వాడీ ఉత్సవ్...



**గర్భిణులకు సీమంతం,పోషణపై సిడిపిఓ అవగాహన**

**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 29.** 9వ జాతీయ పోషణ మాసం-2026 మరియు అంగన్వాడీ ఉత్సవ్ కార్య క్రమాల్లో భాగంగా కూనవరం మండ లం టేకులబోర్-2 అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పోలవరం జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి వి మల్లిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో పిల్లల ఆరోగ్యం,పోషణ, సమగ్రాభివృద్ధిపై అవగాహన కల్పిం చారు.కేంద్ర ప్రభుత్వ పథకాలు పిఎంఎంవివై,మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి,సాక్షం అంగన్వాడీ ల ఆధునీకరణ,పోషణ 2.0,కమ్యూ నిటీ బేస్డ్ ఈవెంట్స్ గురించి సిడిపి ఓ మల్లిక వివరించారు.కార్యక్రమం లో భాగంగా గర్భిణీ స్త్రీలకు సీమం తం నిర్వహించారు.అనంతరం పోషణపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్ర మంలో సెక్టార్ సూపర్వైజర్ ఏ నయోమి రాణి,తల్లులు,కిశోరి బాలికలు,గ్రామ పెద్దలు,యూత్ కమిటీ సభ్యులు,సెక్టార్ లోని అంగ న్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్ పవర్

పోలవరం - ఏలూరు

తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# ఎర్రంపాలెం జీపీఎస్ పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలి





**శిథిలావస్థలో పాఠశాల భవనం.. పిల్లలను పంపేందుకు తల్లిదండ్రుల ఆందోళన**

**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**గంగవరం మండలం కొత్తాడ పంచాయతీ పరిధిలోని ఎర్రంపాలెం గ్రామంలోని జీపీఎస్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల భవనం పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో తమ పిల్లలను పాఠశాలకు పంపించేందుకు భయపడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పాఠశాల భవనం ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనల మధ్య విద్యార్థులు విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే పాఠశాల భవనాన్ని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నట్లయితే పాత భవనాన్ని తొలగించి, విద్యార్థులకు సురక్షితమైన నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో చదువుతున్న చిన్నారుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ సమస్యను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు కుంజం సిద్ధు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

# తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి



- **సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి**
- **పంట బీమాతో సంబంధం లేకుండా అందరికీ నష్ట పరిహారం చెల్లించాలి**

**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 29.** తుఫాన్,భారీ వర్షాలకు,వరదలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ధర్మేంద్రకు వినతిపత్రం అందజేశారు.తుఫాన్ ప్రభావంతో మిరప,మినుము,పెసర, నువ్వులు పంటలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అధికారులు వెంటనే గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని సమగ్రం గా అంచనా వేసి ప్రభుత్వానికి నివే దిక పంపాలని కోరారు.పంటల బీ మా ఉన్నా లేకపోయినా నష్టపో యిన ప్రతి రైతుకు ఎకరాకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.పరిహారం చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులు పెట్టుబడులు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశా రు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, సీపీఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య,జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య,తాలూరి శ్రీను,తెల్లం తమ్మయ్య,వేణు,జగన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలపై మాట్లాడే ముందు వైసీపీ గత పాలనను గుర్తు చేసుకోవాలి



**పెన్ పవర్, ద్వారకాతిరుమల, సెప్టెంబర్ 29:**బీసీల గురించి మాట్లాడే ముందు గత వైసీపీ ఐదేళ్ల పాలనను ఆ పార్టీ నాయకులు ఒకసారి గుర్తు చేసుకోవాలని టీడీపీ ద్వారకాతిరుమల మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్‌కుమార్ (బద్రి) హితవు పలికారు. రాజమండ్రిలో జరిగిన వైఎస్సార్‌సీపీ బీసీ సభలో ఆ పార్టీ నేత

**వెంకన్న బాబు వ్యాఖ్యలపై టీడీపీ నేత రూపేష్‌కుమార్ ఘాటు కౌంటర్**

బొండాడ వెంకన్న బాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ద్వారకాతిరుమలలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రూపేష్‌కుమార్ వైసీపీ నేతలకు పలు ప్రశ్నలు సంధించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే పేరును ప్రస్తావించడం సరికాదన్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధిపై గత ప్రభుత్వ హయాంలో ఏం చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు.

వెంకన్న బాబు కుటుంబ సభ్యులు గతంలో స్థానిక పదవుల్లో ఉన్న సమయంలో బీసీ కాలనీల్లో జరిగిన అభివృద్ధి ఏమిటో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అభివృద్ధి ఏమిటో ప్రజల సమక్షంలో చర్చకు రావాలని రూపేష్‌కుమార్ సవాల్ విసిరారు.బీసీలకు రిజర్వేషన్ల విషయంలోనూ వైసీపీ ప్రభుత్వంపై రూపేష్‌కుమార్ విమర్శలు చేశారు. ఎన్టీఆర్ హయాంలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, చంద్రబాబు నాయుడు వాటిని 33 శాతానికి పెంచారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గాయని ఆయన ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు.

బీసీల సంక్షేమం, అభ్యున్నతిపై ఎవరు ఏం చేశారో మాటలతో కాకుండా అభివృద్ధి పనులతో ప్రజలే నిర్ణయిస్తారని రూపేష్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై విమర్శలు చేసే ముందు వైసీపీ నాయకులు తమ గత పాలనను, అప్పటి నిర్ణయాలను గుర్తు చేసుకోవాలని సూచించారు. బీసీల అభివృద్ధిపై అవసరమైతే బహిరంగ చర్చకు సిద్ధమని ఆయన స్పష్టం చేశారు.

# అఖండ భూమి పర్యాటక ప్రాజెక్టు పై అసత్య ప్రచారం తగదు

**అర్హత కలిగిన ఇన్ ఫ్లూయర్స్ ఎంపిక తో ప్రభుత్వ ప్రచారం**

**మీడియా సమావేశంలో సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం పెన్ పవర్, సెప్టెంబరు 29:** నగరంలో ప్రభుత్వం చేపడుతున్న చేపడుతున్న అఖండ భూమి పర్యాటక ప్రాజెక్టు పై ప్రతిపక్షాలు, వారి ప్రలోభాలకు గురైన కొన్ని వార్త సంస్థలు దుష్ప్రచారం చేయడం తగదని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఖండించారు. దేశంలో ఏ రాష్ట్రానికి లేని పర్యాటక ప్రాజెక్టులు, నిధులు కేటాయింపులు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కు సహకరిస్తుందన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో దుర్గేష్ మాట్లాడుతూ, 20 24 సంవత్సరంలో డిసెంబర్ 13న అఖండ భూమి ప్రాజెక్టుకు డిపి ఆర్ తయారైందని , 2025 లో మరోసారి సవరణ జరిగిందని, 2026లో సాస్కి నిధులు రూ 94.44 కోట్ల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనుల్లో రూ.44 కోట్ల రూపాయలతో హేవ్ లాక్ బ్రిడ్జి అభివృద్ధి , కడియం నర్సరీల ఎక్స్పీరియన్స్ సెంటర్ నిడదవోలు కోట సత్తెమ్మ తల్లి ఆలయం, శెట్టి పేట గోదావరి కాలువ బోటింగ్ బోటింగ్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈ నిధుల్లో రూ.14కోట్లు జీఎస్టీ పన్నులు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ ప్రాజెక్టు రూపకల్పన, నిధుల పై గత వైసిపి ప్రభుత్వం లోనే మంజూరైనట్లు కొంతమంది వైసిపి నాయకులు దుష్ప్రచారం చేయడం నగర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఉందన్నారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని, పర్యాటకులకు విస్తృతంగా ప్రచారం కల్పించేందుకు మీడియా ఇన్ఫ్లేయర్స్ ను ప్రభుత్వం ప్రచారానికి వినియోగించు కుంటుందన్నారు .అయితే ఆయా రంగంలో ప్రతిభా, అర్హత కలిగిన వారిని ఎంపిక చేసుకుంటుందని , వారికే అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. వీరికి ఇచ్చే జీతభత్యాలు కేంద్ర ప్రభుత్వం పర్యాటక పాలసీలోనివే నన్నారు. 2019 2024 లో వైసిపి ప్రభుత్వం పర్యాటక అభివృద్ధికి ,నగరాభివృద్ధికి ఏమి పనులు చేసిందో తెలపాలన్నారు. రానున్న రోజుల్లో మూడు స్టార్ హోటల్స్ నిర్మాణం జరుగుతాయని, గోదావరి పుష్కరాల భక్తులను దృష్టిలో పెట్టుకొని హోం స్టేలు, టెంట్ హౌస్ లు పాలసీలను తెస్తున్నామన్నారు. అరకు, విశాఖ, లంబసింగి, మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో ఎకో టూరిజం రిసార్టను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 960 కిలోమీటర్ల పరిధిలో ఉన్న సముద్ర తీర ప్రాంతంలో సూర్యలంక బీచ్, ఇతర బీచ్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో నిర్వీర్యం చేసిన కళా, సాంస్కృతిక రంగాలను మళ్లీ గాడిలో పెడుతున్నామని వచ్చే డిసెంబరు, జనవరిలో నంది నాటకోత్సవాలను, నంది పురస్కారాలను అందిస్తామని అన్నారు. కూటమి పార్టీల్లో చిచ్చు పెట్టేందుకు ప్రతిపక్ష వైసీపీ కుట్రలు చేస్తుందని, వారి వలలో పడొద్దని అన్నారు. రాష్ట్ర పోలవరం గండి పోచమ్మ ఆలయంలో రూ 9 లక్షల రూపాయలతో మహిళలకు మరుగుదొడ్లు నిర్మించామన్నారు పర్యాటక అభివృద్ధికి త్వరలో క్రీడా, సిని రంగాలకి చెందిన బ్రాండ్ అంబాసిడర్ల ఎంపిక జరుగుతోందన్నారు. 2008లో పిపిపి పాలసీలో మంజీరా హోటల్ కు 33 సంవత్సరాలు లీజుకి ఇచ్చామని, కోవిడ్ కారణాలతో నష్టం జరిగిందని, 63 సంవత్సరాలు లీజుకు పొడిగించమని యాజమాన్యం కోరిందని, ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు.

# బాలికపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల శిక్ష



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్ :-29:**సీతానగరం మండలంలోని సింగవరం గ్రామంలో 2020వ సంవత్సరంలో జరిగిన మైనర్ బాలిక కేసుకు సంబంధించి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగర శిక్ష న్యాయస్థానం విధించినట్లు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు . వివరాల్లోకి వెళితే కొవ్వూరు గ్రామానికి చెందిన గుమ్మడి రాజశేఖర్ 25 సంవత్సరాల వయసు సీతానగరం మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన ఏడు సంవత్సరాల మైనర్ బాలికకు బిస్కెట్లు చాక్లెట్లు ఆశ చూపించి మాయ మటలతో తీసుకెళ్లి పలుసార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు అప్పట్లో కేసు నమోదు చేయడం జరిగింది. అప్పట్లో కోరుకొండ సీఐ సత్య కిషోర్ ఈ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టుకు హాజరు పరిచారు. కాకినాడ ప్రత్యేక పోక్సో న్యాయస్థానం కేసు విచారణ చేసి నిందితుడిపై నేరం రుజువైనట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో నిందితుడైన గుమ్మడి రాజశేఖర్ కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష ఐదువేల రూపాయలు జరిమానా విధించినట్లు జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు సాధారణ జైలు శిక్ష వేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా ఈ కేసును పటిష్టమైన దర్యాప్తు విచారణ చేపట్టిన అప్పటి డిఎస్పి పి. సత్యనారాయణ రావు, ఈ కేసును విచారించిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ అభినందించారు.

# వర్మి కంపోస్ట్ తయారీపై శిక్షణ



**వై రామవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 29** : మండలంలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలలో తడి చెత్త నుండి వర్మి కంపోస్ట్ తయారీపై మంగళవారం శిక్షణ ఇవ్వడం జరిగిందని ఎంపిడిఓ కే బాపన్న దొర తెలిపారు. గ్రామాలలో ఉన్న తడి పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేసే విధానంపై మాస్టర్ ట్రైనర్, పి డి ఓ చిన్ని బాబు సిబ్బందికి ట్రైనింగ్ ఇచ్చారని తెలిపారు. రెండు మండలాల్లో ఉన్న 17 పంచాయితీలలో స్వర్ణ గ్రామ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు వర్మీ కంపోస్ట్ తయారీ, నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణలో తడి పొడి చెత్తను మూలస్థాయిలోనే వేరుచేసి సేకరించడం, తడి చెత్తను ఉపయోగించి వర్మి కంపోస్ట్ తయారు చేయడం పై అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామ సిబ్బంది, క్లాప్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

# రంప ఎర్రంపాలెం జడ్పీ స్కూల్ చైర్మన్ గా నవనాసి వీర వెంకట సత్యనారాయణ.





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 29**:-రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ( స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ) చైర్మన్ గా నవనాసి వీర వెంకట సత్యనారాయణ, వైస్ చైర్మన్ నక్క పావని లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.దేవి సెంటర్ స్కూల్ నందు కమిటీ చైర్మన్ గా ముక్కుడుపల్లి లక్ష్మి,, వైస్ చైర్మన్ గా నూకతట్టి ప్రశాంతి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంప ఎర్రం పాలెం జి బి నగర్ స్కూల్ ఎస్ ఎం సి చైర్మన్ గా బోయిడి శివ,వైస్ చైర్మన్ దువ్వారపు సత్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంప ఎర్రం పాలెం దేవి సెంటర్ స్కూల్ చైర్మన్ గా ముక్కుడుపల్లి లక్ష్మి వైస్ చైర్మన్ గా నూకతట్టు ప్రశాంతి.రంప ఎర్రంపాలెం మెయిన్ స్కూల్ ఎస్ ఎం సి చైర్మన్ గా జగ్గంపూడి వీరబాబు వైస్ చైర్మన్ తేజ దుర్గా లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఎస్ఎంసి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ మరియు సీనియర్ నాయకులు ఉంగరాల రాము గ్రామ తాజా మాజీ సర్పంచ్ బాదంపూడి హర్షిత ప్రకాష్, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు సత్యం వెంకటేశ్వరరావు అనే పెద్దబ్బులు, ఐటిడిపి నియోజకవర్గ ఇన్చార్జి ఉంగరాల గణేష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నారా ప్రసాద్,పప్పు బుజ్జి,జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ బత్తిన రామకృష్ణ, జనసేన నాయకులు బుల్లింకల రాజా సూరపరెడ్డి రామకృష్ణ,గంటా తేజ, భారతీయ జనతా పార్టీ మండల మోర్చా అధ్యక్షులు తొట్టా మల్లేశ్వర రావు,ఉంగరాల ఆదివిష్ణు, గుడిసె శేషయ్య, సూరపు రెడ్డి వెంకటరమణ రంభర్రయంపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ పూర్వపు చైర్మన్ లు నందం పాపారావు, కోరుకొండ సత్తిబాబు, పంతం వీరబాబు, బొదిరెడ్డి శేఖర్, కుంచె వీరబాబు, గంటా శ్రీను, తదితరులు రంప ఎర్రం పాలెం గ్రామంలోని వివిధ పాఠశాలలో నూతనంగా ఎన్నిక కాబడిన తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ వై చైర్మన్ మరియు డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## కొండచిలువ కలకలం: సురక్షితంగా పట్టుకుని తపస్సు కొండ ఫారెస్ట్ లో విడిచిపెట్టిన అధికారులు...



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**మండల కేంద్రంలో స్థానిక సీతపల్లి జంక్షన్ సమీపంలో గల కల్వర్టు వద్ద మంగళవారం భారీ కొండచిలువ ప్రత్యక్షమై స్థానికులను భయాందోళనకు గురిచేసింది. రహదారిలో ఉన్న కల్వర్టు వద్ద కొండచిలువ కదలికలను గమనించిన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే అటవీశాఖ డీ ఆర్ ఓ యోగేంద్ర ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఆయన రాజమండ్రికి చెందిన ప్రముఖ స్నేక్ క్యాచర్ ఈశ్వర్‌ను అప్రమత్తం చేశారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఈశ్వర్, చాకచక్యంగా వ్యవహరించి కొండచిలువను సురక్షితంగా బంధించారు. పట్టుబడిన కొండచిలువ సుమారు పది అడుగుల పొడవు ఉంటుందని డిఆర్ఓ తెలిపారు. ఈ కొండచిలువను సమీపంలో ఉన్న తపస్సు కొండ అటవీ ప్రాంతంలో విడిచి పెడుతున్నట్లు డిఆర్ఓ యోగేంద్ర తెలిపారు. స్థానికులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో స్పందించి పామును సురక్షితంగా తరలించిన అటవీశాఖ అధికారులు, స్నేక్ క్యాచర్‌ను స్థానికులు అభినందించారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు ఎస్ ఎమ్ సి లు కీలకం

**మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తిన రామకృష్ణ**



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 28** :ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ ఎమ్ సి ) చైర్మన్లు, సభ్యులందరికీ మానవ హక్కుల ఫౌండేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా, జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ఎస్ ఎమ్ సి కమిటీ లు ఏకగ్రీవం కావడం, గ్రామాల్లో విద్య పట్ల ఉన్న చైతన్యానికి నిదర్శనం. ఈ సందర్భంగా నూతన ఎస్ ఎమ్ సి కమిటీలకు నా తరపున పలు సూచనలు చేస్తున్నాను.ఎస్ ఎమ్ సి కమిటీ లు – విద్యార్థుల హక్కుల పరిరక్షణకు వేదిక గా ఎస్ ఎమ్ సి కమిటీ అంటే కేవలం సంతకాలు పెట్టే కమిటీ కాదు విద్యా హక్కు చట్టం ( విద్యా హక్కు చట్టం – 2009) ప్రకారం పాఠశాలను నడిపించే యాజమాన్య బాధ్యత మీదే ఉంది. ప్రభుత్వ పాఠశాలను ప్రైవేటు పాఠశాలకు ధీటుగా తీర్చిదిద్దే శక్తి ఎస్ ఎమ్ సి కమిటీలకు ఉంది అని ఆయన అన్నారు.ప్రతి పిల్లాడు బడిలో ఉండాలని మీ పాఠశాల పరిధిలో 6 నుండి 14 ఏళ్ల లోపు ఏ ఒక్క పిల్లాడు బడి మానేసి పనికి వెళ్లకుండా చూడాలని. అలాంటి వారు ఉంటే వెంటనే బడిలో చేర్పించండి ఇది వారి మానవ హక్కు అని తెలిపారు.ప్రభుత్వం ఇచ్చే కాంపోజిట్ గ్రాంట్ నిధులు,మధ్యాహ్న భోజనం నిధులను పారదర్శకంగా, పక్కాగా వినియోగించండి. ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశంలో లెక్కలు చెప్పండి. త్రాగునీరు,ఆడపిల్లలకు ప్రత్యేక టాయిలెట్స్, కరెంట్, ఫ్యాన్లు, లైబ్రరీ, ఆట స్థలం ఉన్నాయా లేదా పరిశీలించండి. లేకపోతే మండల విద్యాశాఖ అధికారి వారి ద్వారా జిల్లా కలెక్టర్ గారికి తీర్మానం పంపి సాధించడంలో కీలకపాత్ర వహించాలని సూచించారు.

నాణ్యమైన విద్య, పోషణ పిల్లలకు అందుతున్న మధ్యాహ్న భోజనం,చిక్కీ,గుడ్లు నాణ్యంగా ఉన్నాయా,టీచర్లు సకాలంలో పాఠాలు చెబుతున్నారా అని గమనించాలని బాలికల రక్షణకు పాఠశాలలో ఆడపిల్లలపై వేధింపులు,బాల్య వివాహాలు జరగ కుండా చూడాలని కోరారు.అదేవిధంగా ఏ పాఠశాలలో నైనా విద్యార్థులకు మౌలిక వసతులు లేకపోయినా, ఉపాధ్యాయుల కొరత ఉన్నా, ఏదైనా సమస్య ఉన్నా, నా దృష్టికి తీసుకురండి. మానవ హక్కుల ఫౌండేషన్ మరియు జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ తరపున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ పాఠశాల బలపడితేనే పేద విద్యార్థి భవిష్యత్తు బలపడుతుంది. రండి, మనందరం కలిసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం.అంటూ నూతన విద్యా కమిటీల చైర్మన్ వైస్ చైర్మన్ కార్యవర్గాలకు మానవ హక్కుల ఫౌండేషన్ బొమ్మను తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు బత్తిన రామకృష్ణ సూచించారు.

## వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు భాగంగా స్వామి ఊరేగింపు.





**ఘనంగా 9 అడుగుల మట్టి వినాయకుని నిమజ్జనం.**



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 29.**తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డు లో మూడు గుళ్లు సెంటర్ లో శ్రీ వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు భాగంగా 9 అడుగుల మట్టి వినాయక స్వామివారి ఊరేగింపు ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించారు. గణేశ నవరాత్రి ఉత్సవాలు భాగంగా మట్టి వినాయకుని పూజిద్ధం, కాలుష్యాన్ని నివారణకు సహకరిద్ధం అన్న నినాధం తో 9 అడుగుల మట్టి వినాయక పూజించారు. ప్రజలందరికీ వినాయకుని ఆశీస్సులు ఉండాలనే ఆశయంతో సంప్రదాయబద్ధంగా వినాయక చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలు, పాడి పంటలు పరిశ్రమలు, అందరూ బాగుండాలి అని ఈ ఉత్సవాలు నవరాత్రిలలో గరిక పూజ, రుద్రాభిషేకం, గణపతి హోమం, జ్యోతిర్లింగార్చన తదితర విశేష పూజలను నిర్వహించామని, గణపతి ఆశీస్సులతో వ్యాపార అభివృద్ధి, ప్రజల సంక్షేమం సమృద్ధిగా జరగాలని కోరుతూ నూతన ఆలయ కమిటీ తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం భారీ ఊరేగింపును నిర్వహించారు. భారీ బ్యాండ్, విచిత్ర వేషధారణ, తీన్మార్, అఘోరాలతో, బాణాసంచా వెలుగులతో పురవీధులలో జరిగిన ఈ శోభా యాత్ర హౌసింగ్ బోర్డు పుర విధుల్లో పట్టణ ప్రజలను విశేషంగా ఆకర్షించింది. ఈ ఊరేగింపు ప్రజలందరూ పాల్గొని స్వామి వారి ప్రసాదాలు స్వీకరించరు. గణపతి ఆశీస్సులు పొందేరు. ఈ కార్యక్రమంలో నూతన ఆలయ కమిటీ, తదితరులు ఉత్సవాల నిర్వహణకు సేవలందించారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ లక్ష్మీ గణపతి నవరాత్రుల ముగింపు

* ఆటో మెకానిక్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం





**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**మండలంలోని తాళ్ళపూడి, ప్రక్కిలంక శ్రీ లక్ష్మీ గణపతి ఆటో మెకానిక్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా ముగిశాయి. నవరాత్రుల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు.ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి యూనియన్ ఆధ్వర్యంలో ఘనమైన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు రకాల పసందైన వంటకాలతో సిద్ధం చేసిన అన్నప్రసాదాన్ని భక్తులకు, గ్రామస్థులకు వడ్డించారు. అన్నదాన కార్యక్రమానికి విశేష స్పందన లభించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, ఉత్సవాల ముగింపు సందర్భంగా అన్నదానం చేపట్టడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.
కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ గణపతి ఆటో మెకానిక్స్, వర్కర్స్ యూనియన్ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవ లో భాగంగా 24వ వార్డు ఎమ్ ఆర్ ఎఫ్ సెంటర్ లో శుభ్రతా కార్యక్రమం.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 29.**తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ – 2026 కార్యక్రమంలో భాగంగా ఈరోజు 24వ వార్డు మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ లో శుభ్రతా కార్యక్రమం నిర్వహించారు.
కమిషనర్ ఎమ్. యేసుబాబు ఆధ్వర్యంలో ఎమ్ ఆర్ ఎఫ్ సెంటర్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను, వ్యర్థాలను శుభ్రం చేశారు. తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేరు చేసే విధానం గురించి సిబ్బందికి, స్థానికులకు అవగాహన కల్పించారు.చెత్త నుండి సంపద సృష్టించడంలో ఎమ్ ఆర్ఫ్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు ఇంటి నుండే చెత్తను వేరు చేసి ఇవ్వడం ద్వారా పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచవచ్చని కమిషనర్ యేసుబాబు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలనిర్వహణ కమిటీ(ఎస్.ఎం.సి.) ఎన్నికలుఏకగ్రీవం




**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.29**
మండలంలోనివడ్డిగూడెంఎం.పి.యు.పి.ఎస్. పాఠశాలోమంగళవారంపాఠశాలనిర్వహణ కమిటీ,ఎస్.ఎం.సి.ఎన్నికలుప్రశాంతంగా ఏకగ్రీవంగాజరగడంగొప్పవిశేషం,పాఠశాలనూతన చైర్మన్,గాముత్యాల సురేష్,కుమార్,వైస్,చైర్మన్, గాగుటాలశైలజఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పాఠశాలనిర్వహణకమిటీ,సమావేశంలో హెచ్.ఎం. వెంకటరమణ,మాట్లాడుతూ పాఠశాలఅభివృద్ధిలో పాఠశాలయాజమాన్యకమిటీ కీలకపాత్రపోషిస్తుందని, తెలిపారు .విద్యార్థులకుమెరుగైనవిద్య, సురక్షితమైన, పాఠశాలవాతావరణం, మౌలికవసతుల,అభివృద్ధి కోసం,ఎస్.ఎం.సి.సభ్యులుఉపాధ్యాయులుసమన్వయంతోపనిచేయాలని,కోరారు.వడ్డిగూడెంపాఠశాలోచదువు కుంటున్న,విద్యార్థులతల్లిదండ్రులు? నూతనంగాఎన్నికైన, చైర్మన్,వైస్,చైర్మన్,లకుహృదయపూర్వకశుభాకాంక్షలు తెలిపారు.

## స్కాట్లాండ్ బ్యాగ్ పైప్ బ్యాండ్ టీంకు 25వేల రూపాయల చెక్కు అందజేత






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 29:**తాడేపల్లిగూడెం పట్టణంలో ఉన్న దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ సిపిఎల్ఐ ఏరియా కోఆర్డినేటర్ మల్లెపూడి ధీరజ్ పుట్టినరోజును అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల సమక్షంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలకు చెందిన స్కాట్లాండ్ బ్యాగ్ పైప్ బ్యాండ్ టీంకు 25వేల రూపాయల చెక్కును ప్రధాన ఉపాధ్యాయులు రాజారావు కి అందజేశారు విద్యార్థులకు పెన్నులు స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరము విద్యార్థులకు మత్తుమందులపై జరుగు నష్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవి ఎడ్యుకేషనల్ సోసైటీ ఫౌండర్ మిత్రా మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు అందిపుచ్చుకొని మంచి ఉన్న స్థాయికి వెళ్లి దేశాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు ప్రధాన ఉపాధ్యాయులు రాజారావు మాట్లాడుతూ చిన్న వయసులో ధీరజ్ తన పుట్టినరోజును మా విద్యార్థుల మధ్య జరుపుకుని మా పాఠశాలకు మంచి మనసుతో ధనసహాయం చేయటం ఎంతో హర్షనియమని మన విద్యార్థులు కూడా బాగా చదువుకుని మంచి ఉన్న స్థాయికి వెళ్లి మీరు కూడా ఇ లా సహాయ సహకారాలు అందించాలని ఎటువంటి దురాలవాట్లవైపు పోవద్దని హితావు పలికారు. ఈ కార్యక్రమంలో సిపిఎల్ఐ స్టాప్ అవినాష్ కోటి సాయి తేజ చందన నాగలక్ష్మి, బాపిరాజు మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఉద్యాన విశ్వవిద్యాలయం - రైతుల సందర్శన.






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 29.**ఒక వైపు ఎలినినో ప్రభావం, మరొక వైపు అకాల భారీ వర్షాల నేపద్యంలో, అనిశ్చితి పరిస్థితుల మధ్య వ్యవసాయ ఆదాయం అంతంత మాత్రంగా ఉంటుందని, ఈ పరిస్థితులలో ఉద్యాన అనుబంధ రంగాల్లో విలువ ఆధారిత ఉత్పత్తులు ద్వారా స్థిరమైన, మంచి నికర ఆదాయాన్ని సంపాదించవచ్చు అని ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. కట్టుపల్లి ధనుంజయరావు గారు ఇచ్చిన ఆలోచన మేరకు, ఈ రోజు పెరవలి, తణుకు, ఉండ్రాజవరం మండలాలకు చెందిన 55 మంది రైతులు వెంకటరామన్నగూడెంలోని కృషి విజ్ఞాన కేంద్రం( కె వి కె)ను సందర్శించారు. రైతులు కృషి విజ్ఞాన కేంద్రం లోని తేనెటీగల పెంపకం, అజొల్లా, వర్మీకంపోస్ట్, సమగ్ర వ్యవసాయ విధానం, షేడ్‌నెట్ నర్సరీ, పశుపోషణ, పౌల్ట్రీ, పుట్టగొడుగుల ఉత్పత్తి తదితర యూనిట్లను సందర్శించి, ఆయా యూనిట్ల నిర్వహణ విధానాలను పరిశీలించారు. వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం కోసం కె. వి. కె. క్రమం తప్పకుండా నిర్వహించే శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొని, అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డా. సి. హెచ్. కిరణ్ కుమార్ సూచించారు. పలువురు రైతులు కె. వి. కె. నిర్వహించే వివిధ శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నమోదు చేసుకున్నారు.కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. శేష కిరణ్, డా. ఈ. రేఖ, డా. ఏ. దేవి వర ప్రసాద్ రెడ్డి, డా. కె. అర్చన ఆయా విభాగాలకు సంబంధించిన సాంకేతిక అంశాలను రైతులకు వివరించారు. ఈ సందర్శన కార్యక్రమం నకు తణుకు వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ ఎం. నరేంద్ర సమన్వయకర్త గా వ్యవహరించారు.

## మద్యం షాపులు దరఖాస్తు చేసుకొంటుకు చివరి తేదీ - 01-10-2026

✷ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శ్రీమతి బి.శ్రీలత.



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 29:**2026-27 సంవత్సరానికి గాను మద్యం షాపులు పొందుటకు గాను పాత లైసెన్సీ లకే రెన్యువల్ చేసుకొనే అవకాశం కల్పించగా జిల్లాలో 25 మంది మద్యం షాప్ యజమానులు రెన్యువల్ చేసుకొని ఉండకపోగా వాటికి దరఖాస్తు చేసుకొనుటుకు ది.01-10-2026 చివరి తేదీగా నిర్ణయించగా నేడు తాడేపల్లి గూడెం మరియు తణుకు సర్కిల్ నందు కల మద్యం షాపు దుకాణ దారులకు స్థానిక తాడేపల్లిగూడెం స్టేషన్ లో ప్రస్తుత లైసెన్సీ విధానం యొక్క లాభాలను మద్యం షాపు దుకాణ దారులకు వివరించి, కనీసం నాలుగు దరఖాస్తు లు చేసుకొంటే లైసెన్స్ పొందవచ్చు నని ఆమె మద్యం షాపు దుకాణ దారులకు వివరించి ఉన్నారు, తాడేపల్లిగూడెం లో మిగిలిన 2 దుకాణాలకు తణుకు లో మిగిలిన 5 దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాల్సింది గా సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏలూరు శ్రీ కే.వి. నాగ ప్రభుకుమార్ స్థానిక ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీమతి ఈ స్వరాజ్యలక్ష్మి, తణుకు సర్కిల్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి మరియు మద్యం షాప్ యజమానులు పాల్గొన్నారు.

## 22 ప్రధానమైన డిమాండ్లు కొరకు నిరసన.

అల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ పిలుపు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 29.**తాడేపల్లిగూడెం ఇంజనీరింగ్ ఆఫీస్ నందు జరిగిన ప్రొట్రెస్ట్ డిమునిస్టేషన్ మద్దతు గా సౌత్ కోస్ట్ రైల్వే మాజ్దూర్ యూనియన్ తరుపున అల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ పిలుపు మేరకు 22 ప్రధానమైన డిమాండ్లు కొరకు నిరసన కార్యక్రమం మంగళవారం నాడు ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా సుమారు 70 మంది కార్మికులు పాల్గొన్నీ నిరసన ప్రదర్శనల చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కెవిఆర్ కుమార్, వైస్ చైర్మన్ ం వెంకటరావు, అసిస్టెంట్ సెక్రటరీ కె మనోహర్ ,కార్మికులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 17 న ఎంఆర్పిఎస్ జాతీయ సమావేశం విజయవంతం చేయండి



**ఎంఆర్పిఎస్ ఎం ఎస్ పి నేతలు పిలుపు.**

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 29 :-** అక్టోబర్ 17వ తేదీన జరగనున్న ఎంఆర్పిఎస్ జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని గోకవరం ఎంఆర్పిఎస్ ఎంఎస్పి ముఖ్య నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం సంజీవయ్య నగర్ లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ముఖ్య నాయకుల సమావేశం ఎంఎస్పి గోకవరం మండల అధ్యక్షులు గరబారపు శ్రీనివాస్ మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పుగోదావరి జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఇన్చార్జ్ బయ్యారపు రాజేశ్వరరావు మాదిగ విచ్చేసి ఎమ్మార్పీఎస్ సోదరుని ఉద్దేశించి మాట్లాడుతూ ఆదేశాల మేరకు అక్టోబర్ 6 మాదిగ విద్యార్థుల ప్రజా ప్రతినిధుల సదస్సు ఉస్మానియా యూనివర్సిటీ , హైదరాబాదులో జరుగును మరియు అక్టోబర్ 17వ తేదీ అమరావతి లో జరుగు జాతీయ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నూతన మండల కమిటీల జాతీయ సదస్సును మండలంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఎం ఎస్ ఎఫ్ అన్ని అనుబంధ సంఘాల గ్రామ మండల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై జాతీయ సదస్సును విజయవంతం చేయాలని మండలంలో ఉన్నటువంటి మహిళ నాయకత్వాన్ని కూడా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతటి వెంకన్న మాదిగ, తోలేటి రాంప్రసాద్ మాదిగ, అరసాల మోహన్ మాదిగ, మోర్త సోమరాజు మాదిగ, బొద్దాన్ని బాపిరాజు మాదిగ, కోడి శ్రీను మాదిగ, ఆరుగుళ్ళ శ్రీను మాదిగ, కోరుమిల్లి కాంతరాజు మాదిగ, అరసాల వెంకన్న మాదిగ, చింతాటి చిట్టయ్య మాదిగ, గొర్త ప్రభుదాసు మాదిగ, పెరువెల్లి దొరబాబు మాదిగ, తోలేటి సురేష్ మాదిగ, కందుకూరి వెంకన్న మాదిగ, దొండపాటి వెంకన్న మాదిగ,బొడ్డుపాటి కిష్టయ్య మాదిగ, దొండపాటి చినబాబు మాదిగ,వంగలపూడి శ్రీను మాదిగ,తోలేటి దావీదు మాదిగ, వేమగిరి ఏసు మాదిగ, తోలేటి చంద్రరావు మాదిగ, వేమగిరి అరవాలి మాదిగ, మరియు మహిళలు అజారి రత్నమాల మాదిగ, తోలేటి రమ్యశ్రీ మాదిగ, ఉండ్రాసి ప్రశాంతి మాదిగ, కొమ్ము గన్నమ్మ మాదిగ, కలదిండి శారా మాదిగ, దిగుమర్తి శ్యామల మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## వనిత లయన్స్ క్లబ్ పీస్ పోస్టర్.










**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 29.**మానవత్వంలో సామరస్య త...వివిధ సంస్కృతులు, నేపథ్యాల ప్రజలు శాంతియుతంగా కలిసి ఉండే ప్రపంచాన్ని యువత చిత్రకళ ద్వారా ఊహించి వ్యక్త పరచడంమే లయన్స్ పీస్ పోస్టర్ ముఖ్య ఉద్దేశం అని రీజియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు. డిస్ట్రిక్ట్ 316 జి లయన్స్ గవర్నర్ లయన్ దశక సుబ్బారావు పిలుపు మేరకు డిస్ట్రిక్ట్ పీస్ పోస్టర్ చైర్ పర్సన్ యనమదుల వెంకట సుబ్రహ్మణ్యం సారద్యం లో డైమండ్స్ లయన్స్ సహకారశీ తో కడియద్ద పరిషత్ హైస్కులు లో లయన్ కొత్త సుభద్ర ఆధ్వర్యంలో పీస్ పోస్టర్ 2026-27 కాంటెస్ట్ కార్యక్రమం రీజయన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణం రాజు ప్రారంభించి మాట్లాడుతూ

"మనమంతా ఒకటే మన చిన్న చిన్న దయాగుణాలు, ప్రేమపూర్వక మాటలు కూడా ప్రపంచంలో పెద్ద మార్పును తీసుకురాగలవని మన ఇంట్లో, మన పాఠశాలలో, మన సమాజంలో శాంతిని సామరస్యం. పెంపొందించడానికి మన వంతు కృషి చేద్దాం.అని విద్యార్థుల లో చైతన్యం తీసుకు వచ్చేలా వారి సృజనాత్మక భావాలు బహిర్గతం చేసే విధంగా అంతర్జాతీయ పీస్ పోస్టర్ కాంటెస్ట్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. లయన్ కొత్త సుభద్ర మాట్లాడుతూ విద్యార్థుల లో లయన్స్ జిల్లా గవర్నర్
టీం పీస్ పోస్టర్ కాంటెస్ట్ ద్వారా విద్యార్థుల లో సమాజ రుగ్మతలు. భావాలు చిత్ర రూపం లో ప్రతిభించే విధంగా కార్యక్రమం రూప కల్పన ఆవిష్కరణ లకు ఫ్లాట్ ఫామ్ లయన్స్ క్లబ్ అన్నారు జోన్ చైర్ పర్సన్ నూకల జయభారతి మాట్లాడుతూ "ప్రపంచ శాంతి" మరియు దానిని ప్రతిబింబించే "శాంతి పోస్టర్"లతో ప్రారంబించిన పీస్ పోస్టర్ లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు అన్నారు లయన్ నాగలక్ష్మి పోటీలో ఉన్న విద్యార్థుల కు విధి విధానాలు తెలిచేశారు పోటీలకు కావాల్సిన మెటీరియల్ డైమండ్స లయన్స్ క్లబ్ తరుపున ఆర్ సి అందించారు మొదటి బహుమతి బి. వి. వి. షణ్ముఖ్ ద్వితీయ విజేత ఓ జ్యోతి తృతీయ బహుమతి బి కార్తీక్ లు పరిశీలకు రాలు లయన్ కొల్లి రమావతి ప్రకటించారు విద్యార్థులు ఉత్సాహం గా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం లో వనిత లయన్స్ క్లబ్ సభ్యులు ఇంద్ర వాణి. లక్ష్మి లలిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి: ఎమ్మెల్యే శిరీషాదేవి





**అడ్డతీగల, పెన్ పవర్,సెప్టెంబర్ 29:** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. అడ్డతీగలలో మంగళవారం సాయి సన్నిధి ఫంక్షన్ హాల్ లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కిసాన్ మేళా--2026లో ఎమ్మెల్యే మిరియాల. శిరీష దేవి పాల్గొని రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించారు. డ్రిప్ ఇరిగేషన్, మట్టి పరీక్షలు, నాణ్యమైన విత్తనాలు, సేంద్రియ వ్యవసాయం, పంటల బీమా, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇది రైతు ప్రభుత్వం అని ప్రభుత్వ రాయితీలు, రైతు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి రైతు పొందేలా అధికారులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే శిరీష దేవి అధికారులను ఆదేశించారు. అనంతరం ఉత్తమ రైతులను సన్మానించి, విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## చాగల్లు జడ్పీ హై స్కూల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వాహణ



**చాగల్లు, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**
చాగల్లు జడ్పీ హైస్కూల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించారు.
ఈ ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు డీవైఈఓ తులసీదాస్ పాఠశాలకు విచ్చేశారు. ఎన్నికల అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో డీవైఈఓ తులసీదాస్ మాట్లాడారు. ఎస్ఎంసీ ఎన్నికల విధి విధానాలు, నిబంధనలను తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే ఎంఈఓ సత్యానంద్, ఎంఈఓ సుధాకర్ ల పర్యవేక్షణలో ఎన్నికలను ముందుకు సాగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికల్లో చైర్‌పర్సన్‌గా షేక్ నగీన బేగం, వైస్ చైర్‌పర్సన్‌గా అర్చన సత్యదేవి ఎన్నికయ్యారు.
ఎన్నికల్లో సుమారు 350 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనగా, మొత్తం 19 మంది పోటీ చేశారు. వీరిలో ఇద్దరు మహిళలు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. మిగిలిన వారు కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యుల్లో 14 మంది మహిళలు, 5 మంది పురుషులు ఉన్నారు. ఎన్నికైన నూతన ఎస్ఎంసీ కమిటీ సభ్యులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ సీసీ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.వాసవి, సీనియర్ ఉపాధ్యాయులు రాళ్లపల్లి వరప్రసాద్, మన్నెల్లి సోమరాజు, జూనియర్ అసిస్టెంట్ అభిమల్లీ నవీన్, గంగాధర్, రమేష్, శ్రీనివాస్, విజయ్ కుమారి, లక్ష్మీదేవి, పూర్ణమాలతి, గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ ఉద్యోగులపై దాడులు దారుణం జక్కంపూడి రాజా



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**సుమారు మూడేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో "మూడు కేసులు.. ఆరు అరెస్టులు" గా పరిస్థితి ఉందని రాజానగరం మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా విమర్శించారు. స్థానికంగా మీడియా సమావేశంలో మంగళవారం ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల వద్దకే పరిపాలనను అందించాలని లక్ష్యంతో ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థను కుటమి ప్రభుత్వం భ్రష్టు పట్టించిందన్నారు. . కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థపై పని భారం పెంచిందని , సర్వీస్ రెగ్యులరైజ్ చేయలేదని, ప్రమోషన్లు ఇవ్వలేదని విమర్శించారు. మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి సచివాలయ వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందు వాలంటీర్లకు జీతాలు పెంచుతామని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి అన్యాయం చేశారని విమర్శించారు. సచివాలయ ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల కోసం ప్రశ్నిస్తే పోలీసు వ్యవస్థను ఉపయోగించి అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని జక్కంపూడి రాజా విమర్శించారు. వైసీపీ నుంచి కొందరు నాయకులు పార్టీని వీడినంత మాత్రాన పార్టీకి ఎలాంటి నష్టం లేదని అన్నారు. వైఎస్ జగన్ పార్టీ తలుపులు తెరిస్తే టీడీపీలోని కొంతమంది ఎమ్మెల్యేలు కూడా వైసీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ కు ప్రజా ధనాన్ని జీతాలు గా ఇచ్చి కూటమి ప్రభుత్వం భజన చేయించుకుంటుందని విమర్శించారు.

# దర్భగూడెంలో వ్యక్తి దారుణ హత్య



**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 29 ;** వ్యక్తి దారుణ హత్యతో ప్రశాంతంగా ఉండే గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. సాయంత్రం వరకు అందరితో కలిసి ఉన్న వ్యక్తి తెల్లారేసరికి రక్తపు మడుగులో మిగతజీవిగా పడి ఉండడంతో భయాందోళన తో గ్రామమంతా ఉలిక్కిపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామంలోని బాపూజీ కాలనీలో పిల్లెం వెంకయ్య (45) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బాపూజీ కాలనీలోని గొంతానమ్మ ఆలయం వద్ద హత్యకు గురై విగత జీవిగా పడి ఉన్న వెంకయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న పోలవరం డీఎస్పీ జయకృష్ణ, జీలుగుమిల్లి సీఐ బి. యాదగిరి, ఎస్సై వి. క్రాంతికుమార్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ తో ఆ ప్రాంతాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు చైతన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీలుగుమిల్లి ఎస్ఐ వి క్రాంతి కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఎస్.ఎం.సి ఎన్నికలు ప్రశాంతం.....



**కొత్తగా కొలువుతీరిన విద్యా కమిటీలు.....**

**అడ్డతీగల ,పెన్ పవర్, సెప్టెంబర్ 29;** మండల కేంద్రమైన అడ్డతీగల లో ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయి. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు అనుగుణంగా, ఈ ఎన్నికలు పాఠశాలల ఉపాధ్యాయ వర్గాలు నిర్వహించాయి ముందుగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన గా నక్క. లోవ కుమారి ఎన్నిక కాగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆర్. పి రాజు చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పాతర.సత్యనారాయణ వెల్లడించారు,స్థానిక గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ గా వేటమావిడికి చెందిన యాకోబు రాజు ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు రూపవతి పేర్కొన్నారు అలాగే ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్గా దాకోడికి చెందిన వంతల. సత్తిబాబు ఎన్నికవుగా వైస్ చైర్మన్ గా వై .రామవరం మండలానికి చెందిన పల్లాల .సీతమ్మ వైస్ చైర్మన్ గా ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ప్రభాకర్ వెల్లడించారు ,బాలుర ఆశ్రమ పాఠశాలలో వీరంపాలెం గ్రామానికి చెందిన కల్లి .వెంకటలక్ష్మి చైర్మన్ గా ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఆనందబాబు తెలిపారు. ఎన్నికైన సభ్యులను పాఠశాలల యాజమాన్యం ఇతర సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తామని ఎన్నికైన వారు ప్రతిజ్ఞ చేశారు.

# పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులకు కార్యకర్తలకు గుర్తింపు -- ఐడీ కార్డుల పంపిణీ.





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 29:**తాడేపల్లిగూడెం పట్టణంలోని 1/2/3/4/వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తల ఐడి కార్డులు పంపిణీ చేయడం నిర్వహించారు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు బలం చేకూర్చేలా, పార్టీ పట్ల వారి నిబద్ధతకు గుర్తింపుగా, నాయకత్వ స్ఫూర్తిని పెంపొందిస్తూ ప్రజల్లో మంచి పేరు, ప్రతిష్టలు సాధించేలా పార్టీ కార్యకర్తలకు ఐడీ కార్డులు అందజేశారు. మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్తకు పార్టీ పరంగా గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో ఈ ఐడీ కార్డులను అందించడం జరిగింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వడ్డీ రఘురామ్ నాయుడు చేతుల మీదుగా కార్యకర్తలకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు..!

ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్చార్జులు వివిధ హోదా నాయకులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు ఎంపీపీలు వైఎస్ఆర్సిపి నాయకుల కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు..

# బీసీలపై వైసీపీ దుష్ప్రచారాన్ని పార్టీలు నేతలు తిప్పికొట్టాలి




**రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల పిలుపు**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 29:**రాష్ట్రంలో ఐక్యమత్యంగా ఉన్న బీసీలలో చీలికలు తెచ్చేందుకు వైసీపీ చేస్తున్న విమర్శలు, దుష్ప్రచారం పై కూటమి పార్టీల బీసీల నేతలు తిప్పి కొట్టాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మంగళవారం తన స్వగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో బీసీలను 56 కార్పొరేషన్లుగా 56 వర్గాలుగా బీసీలను విభజించిందని విమర్శించారు.

బీసీలకు తెలుగుదేశం పార్టీ తొలి నుంచి అధిక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. బలహీన వర్గాలతో పాటు సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ సమాన ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు. బీసీలను తెలుగుదేశం పార్టీకి దూరం చేసేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బీసీల అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక గౌరవం కోసం తెలుగుదేశం పార్టీ 40 సంవత్సరాలుగా కృషి చేస్తోందని పేర్కొన్నారు.బీసీల పట్ల టీడీపీకి చిత్తశుద్ధి లేదని విమర్శించే ముందు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు ఏమి చేశారో ఆ పార్టీ నేతలు ప్రజలకు వివరించాలని గోరంట్ల ప్రశ్నించారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం తమ పార్టీ తీసుకున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

సమాజంలో బాగా వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా, సామాజికంగా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, ఇతర సామాజిక వర్గాలకు ప్రతి సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పించడమే తెలుగుదేశం పార్టీ విధానమని తెలిపారు. .

ఈ ప్రాంతంలో కూడా అన్ని సామాజిక వర్గాల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన తెలిపారు. కులాలు, వర్గాల మధ్య విభేదాలు సృష్టించే రాజకీయాలకు ప్రజలు దూరంగా ఉండాలని, అభివృద్ధి,సంక్షేమమే ప్రధాన అంశాలుగా రాజకీయాలు సాగాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.

# నగర మేయర్ సీటు మాదిగలకే ఇవ్వాలి

* ఎమ్మార్పీఎస్ నేత సుబ్బారావు డిమాండ్




**రాజమహేంద్రవరం పెన్ పవర్ సెప్టెంబర్ 29:**గత ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసిన మాదిగలకు రాజమండ్రి మేయర్ సీటు మాదిగలకే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ మేయర్ పదవిని గతంలో మాల, బీసీ, ఓసీల కు కేటాయించారని, ఈసారి మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నేత సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేయర్ పదవిపై రాజకీయ పార్టీల్లో చర్చ ల్లో మాదిగలకు ఈసారి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. గత 80 ఏళ్లుగా మాదిగ సామాజిక వర్గానికి తగిన రాజకీయ ప్రాధాన్యత, అవకాశాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా పరంగా, సామాజికంగా తమ వర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.కూటమి అభ్యర్థుల విజయానికి మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విస్తృతంగా కృషి చేశారని చిన్న సుబ్బారావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో తమ వంతు పాత్ర పోషించిన మాదిగలకు మేయర్ పదవి ద్వారా తగిన రాజకీయ అవకాశం కల్పించాలని కోరారు. నగర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పేదలు, వికలాంగులు, వృద్ధుల అణగారిన వర్గాల సమస్యల పరిష్కారానికి ఎమ్మార్పీఎస్ ఎంతో పోరాడిందని తెలిపారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకత్వానికి అవకాశం ఇస్తే సమర్థవంతంగా పనిచేస్తామని తెలిపారు. మాదిగలకు మేయర్ పదవి ఇవ్వకుండా ఇతర వర్గాలకు కేటాయిస్తే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని, కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్తామని చిన్న సుబ్బారావు హెచ్చరించారు. తమ డిమాండ్‌ను కూటమి పెద్దలు, రాష్ట్ర నాయకత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు పరిగణనలోకి తీసుకుని మాదిగలకు న్యాయం చేయాలని కోరారు. కూటమి నాయకత్వం చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, దొండపాటి క్రిస్టఫర్, సత్తిబాబు సురేంద్ర బాబు, బొంగా దావీదు, కొత్తపల్లి సాయి, యార్లగడ్డ సతీషు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ఫ్లుయెన్సర్లకు వేతన జీవోపై ప్రభుత్వం పునరాలోచించాలి

**జర్నలిస్ట్ డెమొక్రటిక్ రైట్స్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 29:** రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల ప్రకారం కోసం ఇన్ఫ్లుయెన్సర్లకు గౌరవ వేతనం అందించేలా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం తగదని, ఇటీవల జారీ చేసిన జీవోపై పునరాలోచన చేయాలనిజర్నలిస్ట్ డెమొక్రటిక్ రైట్స్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందిస్తూ నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ఇదే స్థాయిలో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా జర్నలిస్టుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. విధి నిర్వహణలో కుటుంబలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు సరైన సంక్షేమ పథకాలు, సామాజిక భద్రత, ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలని కోరారు.

జర్నలిస్టుల కుటుంబాలకు విద్య, వైద్యం, గృహ నిర్మాణం, ప్రమాద బీమా వంటి అంశాల్లో ప్రభుత్వ పరంగా మరింత సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక సంక్షేమ విధానాన్ని రూపొందించాలని, అర్హులైన జర్నలిస్టుకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని మేడా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి భద్రత కోసం తమ ఫోరం తరఫున ప్రభుత్వంపై నిరంతరం దృష్టి సారిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాదె గిరీష్ కుమార్ గుప్తా, పిచ్చుక మహేష్, మారంపూడి సోమరాజు, ఎండి నజీర్,రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కె. పెదపూడి హైస్కూల్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన మంగాదేవి



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 29**: అంబాజీపేట మండలం కే పెదపూడి గ్రామం లో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ గా కె పెదపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకురాలు నముదూరి మంగాదేవి ఎన్నికైనారు. మంగళవారం పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటి ఎన్నక నిర్వహించారు. ఈ ఎన్నికలలో హైస్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నికైన మంగాదేవి, 11 కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నకైన కమిటి సభ్యుల ను శాలువా పూల మాల లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ యస్ సి సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, కూటమి నాయకులు గోలకోటి నరేష్. వాసర్ల చిన్న. మంద రాజేష్, పెచ్చెట్టి హరిబాబు. పెయ్యేటి చిన్ని .చిక్కం యేసు. గుద్దటి శీను. చిక్కం పల్లంరాజు. నేదునూరి పెద్దిరాజు. చెట్ల రవి నవుదూరి వెంకటేష్ తదితరులు ఈ సన్మాన కార్యక్రమం లో పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## సుస్థిర మౌలిక వసతులపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు




**గండేపల్లి, పెన్ పవర్, (సూరంపాలెం), సెప్టెంబర్ ,29** గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ, సివిల్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో 'జియోటెక్నికల్ ఇంజనీరింగ్ మరియు సుస్థిర మౌలిక సదుపాయాల్లో ఇటీవలి అభివృద్ధులు' అంశంపై ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక నిర్మాణ రంగంలో భూసాంకేతిక ఇంజనీరింగ్, సుస్థిర మౌలిక వసతుల ప్రాధాన్యం పెరుగుతోందన్నారు.
కోర్సులో స్కర్టెడ్ ఫుటింగ్స్ పనితీరు, స్థల పరిశీలన నివేదిక నుంచి పునాది నిర్మాణ సిఫార్సుల వరకు భూసాంకేతిక ఇంజనీర్ పాత్ర, ప్రమాదకర పారిశ్రామిక వ్యర్థాలను సుస్థిర రహదారి నిర్మాణ పదార్థాలుగా వినియోగించడం, విస్తరణ స్వభావం కలిగిన నేలల సమస్యలు--ఆధునిక నివారణ చర్యలు, చికిత్స పొందిన భూ-సహజ పదార్థాల ఇంజనీరింగ్ ప్రవర్తన తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.
ఈ శిక్షణకు డా. టి. జ్ఞానానందరావు, డా. ఎస్. ఆనందకుమార్, డా. చి. అజయ్ వనరుల వ్యక్తులుగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ ప్రతినిధులు, పరిశోధకులకు ఉపయోగపడేలా ప్రత్యేక శిక్షణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. దీని ద్వారా ఆధునిక భూయాంత్రిక ఇంజనీరింగ్ పద్ధతులు, పునాది రూపకల్పన, స్థల పరిశీలన, విస్తరణ నేలల సమస్యలు, పారిశ్రామిక వ్యర్థాల సుస్థిర వినియోగం, సుస్థిర రహదారి నిర్మాణ సాంకేతికతలు తదితర అంశాల్లో తాజా పరిణామాలను తెలుసుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.
ఈ ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమం సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు కొనసాగుతుందని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ తెలిపారు.కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి. శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్స్) డా. ఎస్. రమాశ్రీ, ప్రో వైస్ ఛాన్సలర్ (ఇంజినీరింగ్ అండ్ సైన్స్) డా. ఎ. రమేష్, రిజిస్ట్రార్ డా. జి. సురేష్, ఆదిత్య లెర్నింగ్ అకాడమీ కోఆర్డినేటర్ డా. ఐ. వీరాంజనేయులు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా. బి. రామ్మోహన్ రెడ్డి, అకాడమీ సభ్యుడు బి. మహేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారుద

## ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐపై ఐదు రోజుల శిక్షణ

**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 29 :**స్థానిక ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో సీ.ఎస్.ఈ. (కృత్రిమ మేధస్సు--యంత్ర అభ్యాసం) విభాగం ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థినీ విద్యార్థులకు ఆధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతలపై ఐదు రోజుల శిక్షణా శిబిరం నిర్వహించారు. రేవంత్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి 29 వరకు 'ది ఏజెంటిక్ ఎరా--సూపర్‌చార్జింగ్ ఆర్ఏజీ విత్ విజన్ అండ్ వాయిస్' అనే అంశంపై ఈ శిక్షణ ఇచ్చారు.
ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. పరుచూరి కృష్ణారావు మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన ఇంజనీర్లుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.శిక్షణలో భాగంగా రేవంత్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రతినిధులు ఆర్ఏజీ ఆధారిత అనువర్తనాలు, కృత్రిమ మేధస్సు ఏజెంట్లు, బహుమాధ్యమ కృత్రిమ మేధస్సు తదితర ఆధునిక సాంకేతిక అంశాలపై విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించారు.విద్యార్థుల్లో సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో శిక్షణలో భాగంగా హ్యాకథాన్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. నరేష్ తెలిపారు.సీ.ఎస్.ఈ. (కృత్రిమ మేధస్సు--యంత్ర అభ్యాసం) విభాగాధిపతి డా. ఎ. రాధాకృష్ణ మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు రంగంలో భవిష్యత్తులో లభించే అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడానికి ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి అధ్యాపక సమన్వయకర్తలుగా శ్రీమతి ఎల్. యమున, శ్రీమతి జి.వి. రాజేశ్వరి, శ్రీమతి కె.ఎస్.ఆర్. మంజూష వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మేనేజ్‌మెంట్ ఎం.వి. హరనాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్, డైరెక్టర్--అకడమిక్స్ డా. కె. సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డా. జి. నరేష్, కార్యక్రమ సమన్వయకర్తలు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ద్వారకాతిరుమల వైసీపీ నేత వెంకన్న బాబు వ్యాఖ్యలపై టీడీపీ ఘాటు కౌంటర్




**పెన్ పవర్ ద్వారకాతిరుమల, సెప్టెంబర్ 29:**బీసీల గురించి మాట్లాడే ముందు వైసీపీ నేతలు తమ ఐదేళ్ల పాలనను గుర్తు చేసుకోవాలని టీడీపీ ద్వారకాతిరుమల మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్‌కుమార్ (బద్రి) హితవు పలికారు. రాజమండ్రిలో జరిగిన వైఎస్సార్‌సీపీ బీసీ సభలో ఆ పార్టీ నేత బొండాడ వెంకన్న బాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం ద్వారకాతిరుమలలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతలకు పలు ప్రశ్నలు సంధించారు.రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే మహాత్మా జ్యోతిరావు పూలే పేరును ప్రస్తావించడం సరికాదన్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సంక్షేమాన్ని విస్మరించిన చరిత్ర వైసీపీదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో బీసీల సంక్షేమానికి చేసిన కార్యక్రమాలు, అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు."మీ భార్య మండల అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో బీసీ కాలనీల్లో ఎంత అభివృద్ధి జరిగింది? కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరుగుతున్న అభివృద్ధిపై ప్రజల ముందే చర్చకు వస్తారా?" అని రూపేష్‌కుమార్ ప్రశ్నించారు.ఎన్టీఆర్ హయాంలో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, చంద్రబాబు నాయుడు వాటిని 33 శాతానికి పెంచారని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం బీసీ రిజర్వేషన్లను తిరిగి 32 శాతానికి పునరుద్ధరించిందని తెలిపారు. దీనికి సంబంధించిన శాసనసభ పత్రాలను పరిశీలించుకోవచ్చన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేసే ముందు వైసీపీ నేతలు తమ రాజకీయ గతాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. బీసీల సంక్షేమం, అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మాటలతో కాకుండా చేసిన అభివృద్ధి పనుల ఆధారంగా ఎవరు ఏం చేశారో ప్రజలే నిర్ణయిస్తారని రూపేష్‌కుమార్ పేర్కొన్నారు.

# గోకవరం మండలంలో వివిధ పాఠశాలల చైర్మన్ వీరే..





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 29:-** రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం జరిగిన వివిధ పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ ( స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ) ఎన్నికలు గోకవరం మండలంలో ప్రశాంతంగా జరిగాయి ఒక గుమ్మల దొడ్డి గ్రామం లో లాటరీ విధానంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. నిర్ణీత సమయం ప్రకారం వివిధ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు సంరక్షకులు వివిధ గ్రామాల పెద్దలు సమక్షంలో జరిగిన ఈ ఎన్నిక ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారిని బి గౌరమ్మ,, చిన్ని రాజుదొర లు తెలిపారు.
వెంకటాపురం ఎంపీపీ చైర్మన్ గా టి ధర్మజ్యోతి.. వైస్ చైర్మన్ గా కె కనకరత్నం,,చిన్నూరు స్కూల్ చైర్మన్ గా సిహెచ్ రవళి,,వైస్ చైర్మన్ గా బి హెప్సిబా,, కొత్తూరు చైర్మన్ గా ఎం నాగమణి, వైస్ చైర్మన్ గా బి వరలక్ష్మి,, రామన్నపాలెం చైర్మన్ గా చంద్రన్న, వైస్ చైర్మన్ గా సుధాకర్ రెడ్డి,ఏబీఎన్ కొత్తపల్లి చైర్మన్ గా పి రవికాంత్, వైస్ చైర్మన్ గా పి చిన్నారి,దుళ్ల వీధి చైర్మన్ గా కె వీరబాబు వైస్ చైర్మన్ గా కే దుర్గాభవాని, రాజు గారి తోట చైర్మన్ డి రాజు,వైస్ చైర్మన్ గా వి గౌతమి, వేలంపేట చైర్మన్ గా బి శ్రీనివాస్, వైస్ చైర్మన్ గా జీ వి నాగలక్ష్మి,మెయిన్ స్కూల్ కొత్తపల్లి చైర్మన్ గా సిహెచ్ దేవి సూర్య,వైస్ చైర్మన్ గా ఎల్ కళ్యాణి, కామరాజుపేట చైర్మన్ గా జై దుర్గా భవాని, వైస్ చైర్మన్ గా టీ కల్పన, దుర్గా కాలనీ చైర్మన్ గా టీ దుర్గ భవాని, వైస్ చైర్మన్ గా ఎస్ మోహన్,రణా సెంటర్ చైర్మన్ గా ఎం రమణి వైస్ చైర్మన్ గా డి వీరబాబు,వీరలంకపల్లి చైర్మన్ దుర్గాభవాని, వైస్ చైర్మన్ సిహెచ్ సాయి జ్యోతి, ఆర్ సి గోకవరం చైర్మన్ గా ఎన్ రమ్య, వైస్ చైర్మన్ గా సిహెచ్ వెంకటేశ్వరరావు,మెయిన్ స్కూల్ గోకవరం చైర్మన్ గా జి సత్య, వైస్ చైర్మన్ గా ఏ సుబ్బారావు, తిరుమలాయపాలెం చైర్మన్ గా బి రాజబాబు, వైస్ చైర్మన్ గా వి వరలక్ష్మి, ఠాగూర్ పాలెం చైర్మన్ గా వైస్ చిరంజీవి, వైస్ చైర్మన్ గా ఎం దుర్గ,, సూది కొండ చైర్మన్ గా ఏ శివలక్ష్మి, వైస్ చైర్మన్ గా కే మరియా, జగన్నాధపురం చైర్మన్ గా బి శ్రీనివాస్,వైస్ చైర్మన్ గా ఎన్ నూకరత్నం, శివరామపట్నం చైర్మన్ గా ఐ రాజబాబు,వైస్ చైర్మన్ గా కె శ్రావణి,తాడితోట మల్లవరం చైర్మన్ గా బి ప్రసాద్, వైస్ చైర్మన్ గా ఏ అనంతలక్ష్మి,మల్లవరం చైర్మన్ గా ఏ శ్రీను, వైస్ చైర్మన్ గా ఆర్ లక్ష్మి,కలిజోళ్ళ చైర్మన్ గా ఎస్ రాంబాబు, వైస్ చైర్మన్ గా కె సంతోష్ రూప,రంప ఎర్రం పాలెం చైర్మన్ గా జే వీరబాబు, వైస్ చైర్మన్ గా సిహెచ్ తేజ దుర్గ, దేవి సెంటర్ ఎం లక్ష్మి వైస్ చైర్మన్ గా ఎన్ ప్రశాంతి, జి బి నగర్ చైర్మన్ గా బి శివ, వైస్ చైర్మన్ గా డి సత్య, ఎస్ నగర్ తంటికొండ చైర్మన్ గా జి వినోద్, వైస్ చైర్మన్ గా ఎస్ ఏసురత్నం, ఎస్విటి స్ట్రీట్ తండికొండ చైర్మన్ గా పి చంద్ర రావు, వైస్ చైర్మన్ గా పి నాగదివ్య, గోపాలపురం చైర్మన్ గా ఏ రంగమ్మ, వైస్ చైర్మన్ గా టి చినలావయ్య,గాదెలపాలెం చైర్మన్ గా కె జాన్ విన్సీ, వైస్ చైర్మన్ గా పి నాగ తులసి,అచ్యుతాపురం చైర్మన్ గా వై పాపారత్నం, వైస్ చైర్మన్ గా కె భాస్కరరావు, గుమ్మల దొడ్డి చైర్మన్ గా బి ప్రసాద్, వైస్ చైర్మన్ గా పి కృష్ణవేణి,గుమ్మల దొడ్డి కొత్తపేట చైర్మన్ గా ఎం వీర మహాలక్ష్మి వైస్ చైర్మన్ డి నాగు,బవాజీ పేట చైర్మన్ గా జి అప్పలకొండ,వైస్ చైర్మన్ గా బి లక్ష్మీదేవి,కృష్ణుని పాలెం చైర్మన్ ఏ వెంకటరమణ, వైస్ చైర్మన్ గా వి హరికృష్ణ, సంజీవ్ నగర్ చైర్మన్ గా జై సంధ్య, వైస్ చైర్మన్ గా పి శారద,టి నగర్ చైర్మన్ గా ఎం రామలక్ష్మి, వైస్ చైర్మన్ గా కె దుర్గా,గోకవరం ఉర్దూ స్కూల్ చైర్మన్ గా ఎస్కే బషీర్, వైస్ చైర్మన్ గా పి వెంకన్న,పెంటపల్లి చైర్మన్ గా వి శ్రీను,వైస్ చైర్మన్ గా డి శివయ్య, తిరుమలాయపాలెం జడ్పీ స్కూల్ చైర్మన్ గా చక్ర రావు, వైస్ చైర్మన్ గా వి మంగారావు, ఎంపీయూపీ గంగపాలెం చైర్మన్ గా కె కృష్ణ, వైస్ చైర్మన్ వైయస్ దుర్గ,ఎంపీయుపి ఇటికాయలపల్లి చైర్మన్ గా చంద్రబాబు, వైస్ చైర్మన్ గా డి అపర్ణ, ఎం పి యు పి అచ్యుతాపురం చైర్మన్ గా కె వెంకన్న, వైస్ చైర్మన్ గా ఎం లక్ష్మి,ఎంపీయుపి ఎదురుపాక చైర్మన్ గా ఎమ్ శివన్న, వైస్ చైర్మన్ గా బి లావణ్య,జిల్లా పరిషత్ కామరాజుపేట చైర్మన్ పి వైదేహి, వైస్ చైర్మన్ గా ఏ వీరబాబు, జిల్లా పరిషత్ గోకవరం చైర్మన్ గా ఎం నాగేశ్వర రావు, వైస్ చైర్మన్ గా ఎస్ వాసుమాంబ, జడ్పీ మల్లవరం చైర్మన్ గా ఎల్ శ్రీను, వైస్ చైర్మన్ గా ఎస్ పార్వతి,రంప ఎర్రం పాలెం జడ్పీ చైర్మన్ గా ఎన్ వి వి సత్యనారాయణ, వైస్ చైర్మన్ గా ఎన్ పావని, జడ్పీ తంటికొండ చైర్మన్ గా ఎన్ వెంకట్రావు, వైస్ చైర్మన్ గా వి హరికృష్ణ, జడ్పీ గుమ్మలదొడ్డి చైర్మన్ గా సిహెచ్ శ్రీనుబాబు, వైస్ చైర్మన్ గా ఎస్ సత్యవేణి, ఏపీ ఆర్ భూపతి పాలెం స్కూల్ చైర్మన్ ఎ రాజీవ్, వైస్ చైర్మన్ గా కె గంగావేణి,ఏపీ ఆర్ రెసిడెన్షియల్ వీరలంకపల్లి చైర్మన్ ఎస్ విజయభారతి, వైస్ చైర్మన్ గా పి ప్రశాంతి,డివిపిఆర్ ఎయిడెడ్ స్కూల్ మల్లవరం చైర్మన్ గా టి చంద్రలత, వైస్ చైర్మన్ గా ఎల్ సత్యవతి లను వివిధ పాఠశాలల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లుగా ఎన్నుకోవడం జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి బి గౌరమ్మ, చిమ్మిరాజు దొర లు తెలిపారు.

## ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రధాన్యత రైతులకు మెరుగైన సేవలు



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 29:**ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత నిస్తుందని రైతులకు మెరుగైన సేవలు అందిచాల్సిన భాధ్యత మనపై ఉందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మార్కెట్ కమిటీ సమావేశం వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వర అధ్యక్షతన మంగళవారం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వైస్ చైర్మన్ అన్నారు. మార్కెట్ కమిటీ పరిధిలోని అంతర్గత రహదారుల నిర్మాణంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కమిటి సభ్యులు అంబటి గంగాభవాని, మట్టపర్తి సోమేశ్వరరావు, దుర్గా శ్రీనివాసరావు, కుడుపూడి సత్యవేణి, అడబాల సూర్యవతి, పోసూరు పోచమ్మ, సలాది ప్రసాద్, గంధం వెంకటేశ్వరావు, కార్యదర్శి ఐ.రమేష్, యు డి సి ప్రశాంత్ కుమార్ లు పాల్గొన్నారు

## ర్యాలిలో జగన్మోహిని కేశవస్వామికి వైభవంగా పూజలు

ఐదు బుధవారాలు.. ఐదు ప్రదక్షిణాలతో కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం




**ఆత్రేయపురం పెన్ పవర్ సెప్టెంబర్ 29:** కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసి ఉన్న ప్రాచీన శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయం మంగళవారం భక్తుల ఆధ్యాత్మిక సందడితో కళకళలాడింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి నిలువెత్తు దర్శనం చేసుకుని పులకించిపోయారు. ఏకశిలపై పురుషరూపంలో శ్రీ కేశవస్వామిగా, వెనుకవైపు శ్రీరూపంలో జగన్మోహినిగా దర్శనమిచ్చే అరుదైన విగ్రహం ఈ ఆలయ ప్రత్యేకతగా నిలుస్తోంది. స్వామివారి రెండు పాదాల మధ్య నుంచి గంగాజలం నిత్యం ఉద్భవిస్తుందని భక్తుల విశ్వాసం. గర్భగృహ ప్రవేశం కలిగిన అత్యంత ప్రాచీన దేవాలయాల్లో ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయం ఒకటిగా ప్రసిద్ధి చెందింది. స్వామివారిని ఐదు బుధవారాలు దర్శించుకుని, ఐదు ప్రదక్షిణలు చేస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ నమ్మకంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, మొక్కుబడులు నిర్వహించారు. అనంతరం ఆలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన నిత్య అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గోరంట్ల గ్రామానికి చెందిన ఆళ్ల రామగోపాల్‌రెడ్డి--లక్ష్మి దంపతులు రూ.10,116 విరాళాన్ని, కాకినాడకు చెందిన నిట్టల కనక శ్రీరామచంద్ర శరత్ సంజయ్ రూ.10,116ను ఆన్‌లైన్ ద్వారా ఆలయానికి విరాళంగా సమర్పించారు. దాతలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు వెంకట అవధాని వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎం. శ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి దాతలను శాలువాతో సత్కరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి ద్వారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు

## తుప్పు పట్టిన విద్యుత్ స్థంభం నిర్లక్ష్యం గా విద్యుత్ సిబ్బంది



**అంబాజీపేట, పెన్ పవర్, సెప్టెంబరు 29:**కాలంచెల్లిన విద్యుత్ ఇనుప స్థంబాలను మార్పు చేయకుండా పట్టించుకోని సిబ్బంది. బస్టాండ్ సమిపంలో ఉన్న విద్యుత్ స్థంభం పురాతనమైన ఇనుప స్థంభం కావడంతో పూర్తిగా ప్రక్కకు ఒరిగి తుప్పు పట్టి విరిగిపోయేదశలో ఉంది. ప్రమాదకరమైనదిగా ఉన్న స్థంబాల ను మార్పులు చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం వహించడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. అదే స్థంభం పై విద్యుత్ రిపేరుకు సిబ్బంది స్థంభం పైకి ఎక్కి విధులు నిర్వహించాలి ప్రమాదంగా ఉన్న స్థంభం స్థానే కొత్త స్థంబాన్ని వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రశాంతంగా ముగిసిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు






**గండేపల్లి, పెన్ పవర్, సెప్టెంబర్, 29** గండేపల్లి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలోని మొత్తం 41 ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.
వీటిలో 31 ప్రాథమిక పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, ఎనిమిది ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా సాగింది.
మండల విద్యాశాఖ అధికారులు కె.హెచ్. నాయక్, కె. వెంకటరెడ్డి, మండల విద్యాశాఖ సిబ్బంది పర్యవేక్షణలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించిన మండల అభివృద్ధి అధికారి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పోలీసు శాఖకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికైన ఎస్ఎంసీ సభ్యులు రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములై, ప్రభుత్వ కార్యక్రమాలన్నీ పాఠశాలల్లో సమర్థవంతంగా అమలయ్యేలా సహకరించాలని పధానోపాధ్యాయులు సభ్యులకు సూచించారు. అనంతరం ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

# టీ20ల్లో శ్రీ చరణి సరికొత్త రికార్డు.. మళ్లీ టాప్-5లోకి స్మృతి మంధాన!



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన మహిళల టీ20ఐ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీ చరణి సంచలన రికార్డు సృష్టించింది. అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ కెరీర్‌లోనే అత్యధికంగా 817 రేటింగ్ పాయింట్లను సాధించి సరికొత్త చరిత్ర సృష్టించింది. దీంతో నవంబర్ 2018 నుంచి ఆస్ట్రేలియా స్టార్ బౌలర్ మెగాన్ షట్ పేరు మీద ఉన్న 806 పాయింట్ల ఆల్-టైమ్ రికార్డును శ్రీ చరణి బ్రేక్ చేసేసింది. ఆసియా కప్ టోర్నమెంట్‌లో భారత్ విజయం సాధించడంలో శ్రీ చరణి కీలక పాత్ర పోషించింది. ఈ టోర్నీలో మొత్తం 12 వికెట్లు తీసిన ఆమె, శ్రీలంకతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 4/20తో అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇక ఆసియా క్రీడలలోనూ తన జోరును కొనసాగించిన చరణి.. జపాన్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో కేవలం 10 పరుగులే ఇచ్చి 4 వికెట్లు (4/10) పడగొట్టి కెరీర్ బెస్ట్ ఫిగర్స్ నమోదు చేసింది. అంతేకాకుండా శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక పోరులోనూ కీలకమైన 2 వికెట్లు తీసి టీమిండియాకు గోల్డ్ మెడల్ అందించడంలో ప్రధాన భూమిక పోషించింది. ఈ అద్భుతమైన ప్రదర్శనే ఆమెను ఐసీసీ చరిత్రలోనే అత్యధిక రేటింగ్ సాధించిన బౌలర్‌గా నిలబెట్టింది.

**టాప్-5లోకి దూసుకొచ్చిన స్మృతి, దీప్తి శర్మ:**

ఆసియా క్రీడల ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో 79 పరుగులు సాధించిన భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-5లోకి దూసుకొచ్చారు. అంతేకాకుండా ఆమె వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని పదిలపరుచుకున్నారు.

ఆసియా క్రీడల ఫైనల్‌లో మూడు వికెట్లు తీసిన ఆల్ రౌండర్ దీప్తి శర్మ 754 పాయింట్లతో తన స్థానాన్ని మరింత మెరుగుపరుచుకోగా, ఇంగ్లాండ్ ఆటగాడు సోఫీ ఎక్లెస్టన్ (723) మూడో స్థానంలో కొనసాగుతుంది.

# వర్షం దెబ్బకు నాలుగు క్వార్టర్ ఫైనల్స్ రద్దు.. సెమీస్ బెర్త్ ఫిక్స్: పాక్‌తో కాదు శ్రీలంకతోనే భారత్ ఢీ




**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 ఆసియా క్రీడలలో పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌ను వర్షం తీవ్రంగా దెబ్బతీసింది. నిరంతరం కురుస్తున్న వర్షాల కారణంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లన్నీ రద్దు కావడంతో, టోర్నమెంట్ రూల్స్ ప్రకారం సెమీఫైనల్స్ బెర్త్‌లు ఖరారయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమిండియా.. ఫైనల్ పోరుకు అర్హత సాధించేందుకు శ్రీలంకతో తలపడనుంది.

**వర్షం దెబ్బకు అన్నీ క్వార్టర్ ఫైనల్స్ రద్దు:**

నాగోయా, నిస్షిన్ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మెన్స్ క్రికెట్ నాకౌట్ దశ మ్యాచ్‌లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాకిస్థాన్ - హాంకాంగ్, భారత్ ఆఫ్ఘనిస్తాన్ జట్ల మధ్య జరగాల్సిన తొలి రెండు క్వార్టర్ ఫైనల్స్ వర్షంతో పూర్తిగా రద్దయ్యాయి. ఐసీసీ టీ20ఐ ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉన్న కారణంగా భారత్, పాకిస్థాన్‌లు నేరుగా సెమీస్‌లోకి ప్రవేశించాయి. అలాగే శ్రీలంక వర్సెస్ నేపాల్, బంగ్లాదేశ్ వర్సెస్ మలేషియా మ్యాచ్‌లు కూడా వర్షార్పణం కావడంతో, ర్యాంకింగ్ ఆధారంగా శ్రీలంక, బంగ్లాదేశ్ కూడా సెమీఫైనల్‌కు చేరుకున్నాయి.

**శ్రేయస్ కెప్టెన్సీలో బరిలోకి భారత్:**

స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు ఇంకా ఈ ఆసియా క్రీడల్లో ఒక్క మ్యాచ్ కూడా ఆడకపోయినా నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ జట్టులో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాతో పాటు 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ కూడా చోటు దక్కించుకోవడం విశేషం. ప్రధాన కోచ్ గౌతం గంభీర్ గైర్హాజరీలో నేషనల్ క్రికెట్ అకాడమీ చీఫ్ వీవీఎస్ లక్ష్మణ్ ఈ టోర్నీకి హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

**అక్టోబర్ 1న సెమీఫైనల్స్:**

వర్షం అంతరాయం తొలగిపోయి, వాతావరణం అనుకూలిస్తే అక్టోబర్ 1వ తేదీ (గురువారం)న రెండు హై-వోల్టేజ్ సెమీఫైనల్స్ జరగనున్నాయి.

మొదటి సెమీఫైనల్: పాకిస్థాన్ ఙం బంగ్లాదేశ్

రెండో సెమీఫైనల్: భారత్ ఙం శ్రీలంక (వేదిక: కొరోగి స్పోర్ట్స్ పార్క్, నిస్షిన్)

# ట్రాక్‌పై దుమ్మురేపిన భారత అమ్మాయిలు.. 4X400 మీటర్ల రిలేలో స్వర్ణం







**హైదరాబాద్ పెన్ పవర్:** వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడలలో (ఙాంఙుఅ +ఙఎవం 2026) అథ్లెటిక్స్ విభాగంలో భారత్ ఎట్టకేలకు తన తొలి బంగారు పతకాన్ని సాధించింది. గత కొన్ని రోజులుగా రజత, కాంస్య పతకాలతో సరిపెట్టుకున్న టీమిండియా అథ్లెట్లు, ఈరోజు (సెప్టెంబర్ 29, మంగళవారం) జరిగిన మహిళల 4ఙ400 మీటర్ల రిలే ఫైనల్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి దేశానికి చిరస్మరణీయ పసిడిని అందించారు.

**అదరగొట్టిన మహిళల జట్టు.. అథ్లెటిక్స్ లో స్వర్ణం:**

భారత మహిళల రిలే జట్టులో కీలక సభ్యులైన విత్య రామ్‌రాజ్, కిరణ్ పహల్, మచేత్తిర పూవమ్మ, ప్రాచి అద్భుతమైన సమన్వయంతో బరిలోకి దిగారు. హోరాహోరీగా సాగిన ఈ తుది పోరులో భారత క్వార్టెట్ కేవలం 3:29.69 సెకన్ల వ్యవధిలో గమ్యస్థానాన్ని చేరి మొదటి స్థానంలో నిలిచింది. చివరి ల్యాప్‌లో బహ్రెయిన్ (3:30.21), చైనా (3:31.02) జట్ల నుంచి తీవ్రమైన పోటీ ఎదురైనప్పటికీ, భారత రన్నర్లు ఏమాత్రం తడబడకుండా అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నారు. బహ్రెయిన్ రజతం, చైనా కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నాయి.

**చరిత్ర సృష్టించిన విత్య.. ఒకే గేమ్స్‌లో 3 పతకాలు:**

ఈ స్వర్ణ పతకం గెలుపుతో అథ్లెట్ విత్య రామ్‌రాజ్ తన అద్భుతమైన ఆసియా క్రీడల ప్రయాణాన్ని ముగించింది. ఈ క్రీడలలో ఆమెకు ఇది మూడో పతకం కావడం విశేషం. ఇప్పటికే మిక్స్‌డ్ 4ఙ400 మీటర్ల రిలేలో రజతం సాధించిన విత్య.. మహిళల 400 మీటర్ల హర్డిల్స్ విభాగంలో దిగ్గజ అథ్లెట్ పీటీ ఉష యొక్క 42 ఏళ్ల నాటి జాతీయ రికార్డును (54.75 సెకన్లు) బద్దలు కొట్టి మరీ కాంస్య పతకం గెలుచుకుంది. తాజాగా ఈ రిలే గోల్డ్‌తో ఆమె తన ఖాతాలో అరుదైన ట్రిపుల్ మెడల్స్ సాధించారు.

# దసరా బరిలో జైలర్ 2 & రణబాలి ప్రమోషనల్ స్ట్రాటజీ!





దసరా పండుగ అత్యంత ఆసక్తికరంగా మారబోతోంది. పండుగ వాతావరణంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న -జైలర్ 2-, విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న జంటగా తెరకెక్కుతోన్న -రణబాలి- చిత్రాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రెండు చిత్రాలు దసరా కానుకగా ఒక్క రోజు గ్యాప్ లోనే విడుదలవుతుండటంతో సన్నివేశం ఆసక్తికరంగా మారుతోంది.

నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న -జైలర్ 2- ( అక్టోబర్15) పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. మొదటి భాగంలో టైగర్ ముత్తువేల్ పాండ్యన్‌గా రజినీకాంత్ చూపించిన పవర్ ఫుల్ యాక్షన్ అండ్ మేనరిజమ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో సీక్వెల్‌లో రజినీకాంత్ పాత్ర ఎలా ఉండబోతోంది? యాక్షన్ ఎపిసోడ్స్ ఏ స్థాయిలో తెరకెక్కించారనే విషయంపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.మరోవైపు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నటిస్తోన్న -రణబాలి-( అక్టోబర్ 16) చిత్రం కూడా అదే రేంజ్‌లో అంచనాలను పెంచేస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా పీరియాడికల్ యాక్షన్ డ్రామా స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కొన్ని చీకటి అధ్యాయాలు, యదార్థ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకుంటోంది.అయితే ఈ రెండు చిత్రాల ప్రమోషన్స్ కోసం ఎంచుకున్న వినూత్న వ్యూహం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. రెండు చిత్రబృందాలు టీజర్లు, ట్రైలర్లతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీల ద్వారా ప్రమోషన్లు నిర్వహించే ఒకే రకమైన స్ట్రాటజీని ఫాలో అవుతున్నాయి. ఇప్పటికే -జైలర్ 2- టీమ్ -జైలర్ 2 అన్‌లాక్డ్- పేరుతో విడుదల చేసిన స్పెషల్ డాక్యుమెంటరీ యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో నిలవగా.. -రణబాలి- బృందం కూడా ఏకంగా నాలుగు ఎపిసోడ్ల భారీ మేకింగ్ డాక్యుమెంటరీ సిరీస్‌ను విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది.సినిమా వెనుక ఉన్న కష్టం, టెక్నికల్ విలువలు, లొకేషన్లు , నటీనటుల శ్రమను డాక్యుమెంటరీ రూపంలో నేరుగా ప్రేక్షకులకు చూపించడం వల్ల సినిమాపై మరింత కనెక్టివిటీ, విశ్వసనీయత పెరుగుతాయని నిర్మాతలు భావిస్తు న్నారు. సాధారణ ప్రచార చిత్రాల కంటే ఇలాంటి బిహైండ్-ది-సీన్స్ డాక్యుమెంటరీలు జాతీయ స్థాయిలో సినీ ప్రేమికులను ఆకట్టుకుంటూ సినిమా మేకింగ్ ప్రమాణాలను ఉన్నత స్థాయిలో నిలబెడుతున్నాయి.రెండు సినిమాల బాట ఒకటే కావడంతో సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పవర్ ఫుల్ మాస్ యాక్షన్ అంశాలతో -జైలర్ 2- వస్తుంటే? వైవిధ్యమైన చారిత్రక కథాంశంతో -రణబాలి- రేసులో ఉంది. మరి దసరా బరిలో ఎవరు విజేత అవుతారు? అన్నది చూడాలి.

అయితే ఈ రెండు సినిమాల ప్రభావం చాలా సినిమాలపై పడుతుంది. పండగ నేపథ్యంలో చాలా సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. దీంతో థియేటర్ల పరంగా ఇబ్బంది ఎదురవుతుంది.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965